ప్రజాశక్తి

గురువారం 26 జూన్ 2025

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

ప్రజాస్వామ్యంపై పెద్ద దాడి ఎమర్జెన్సీ

సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు

సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : ఎమర్జెన్సీ అనేది ప్రజాస్వామ్యంపై జరిగిన ఒక పెద్ద దాడి అని సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు పేర్కొన్నారు. '50ఏళ్ల ఎమర్జెన్సీ - నేటి నయా ఫాసిస్ట్ ప్రమాదం' అనే అంశంపై బుధవారం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సిపిఎం నాయకులు డాక్టర్ బి.గంగారావు అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యవక్తగా సిహెచ్.నర్సింగరావు హాజరై మాట్లాడుతూ, ఎమర్జెన్సీ సమయంలో ఆంధ్ర యూనివర్సిటీలో తాను ఎస్ఎఫ్ఐ నాయకునిగా ఉన్నానని తెలిపారు. ఆ సమయంలో ఉద్యమంలో భాగంగా చేసిన నిరసనలకు తనపై అరెస్ట్ వారెంట్ ఇచ్చారని, తాను తప్పించుకున్నానని తెలిపారు. ఎమర్జెన్సీ కాలంలో విశాఖ జిల్లాలో ఉద్యమం అంతగా సాగలేదని, హైదరాబాదులో మాత్రం ప్రతి పబ్లిక్ సెక్టార్ రంగంలోనూ భారీగా అరెస్టులు జరిగాయని వివరించారు. ఎమర్జెన్సీలో ప్రధానంగా ధరల పెరుగుదలతో అందరిపైనా భారం వేసి ప్రజలకు కొనుగోలు శక్తిని తగ్గించి దేశాన్ని విచ్ఛిన్నం చేశారని పేర్కొన్నారు. ప్రస్తుత పాలకులు పత్రికా స్వేచ్ఛ, స్వాతంత్ర్యాన్ని, అన్నింటినీ అణిచివేసే చట్టాలు తీసుకొచ్చారని తెలిపారు. బిజెపి ప్రభుత్వం హిందూవాదం పేరుతో మతోన్మాదాన్ని ప్రచారం చేస్తోందని, అధికారంలోకి రావడమే ప్రధాన విధిగా పెట్టుకుని బిజెపి పనిచేస్తోందని, పాలనా విధానాన్ని ఫాసిస్టు పద్ధతుల్లోకి తీసుకువెళుతోందని వివరించారు. ఆనాడు హిట్లర్ మాదిరిగా ప్రస్తుతం ట్రంప్ కూడా పనిచేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పశ్చిమ యుద్ధం కారణంగా రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా చమురు ధరలు పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రజల ఆదాయం రోజురోజుకు క్షీణిస్తోందని, పెట్టుబడిదారుల ఆదాయం పెరుగుతోందని చెప్పారు. మన దేశం చుట్టూ ఉన్న అన్ని దేశాలతోనూ మోడీ విభేదాలు పెట్టుకున్నారన్నారు. ప్రస్తుత బిజెపి ప్రభుత్వ ఐడియాలజీకి వ్యతిరేకంగా మనమంతా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ, ప్రస్తుతం దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ పేరుతో ఆంధ్ర రాష్ట్రానికి జరిగిన లాభమేమీ లేదని, ఇది డబుల్ ఇంజిన్ సర్కారు కాదు ట్రబుల్ ఇంజన్ సర్కార్ అని ఎద్దేవా చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్రపతికి పార్లమెంటు సభ్యులకు కనీస ప్రాధాన్యత ఇవ్వకుండా ఏకపక్షంగా పాకిస్తాన్‌పై యుద్ధాన్ని ప్రకటించారని, యుద్ధాన్ని విరమించే సమయంలో కూడా దేశంలో ఎవరితోనూ చర్చించకుండా ట్రంప్

మిగతా 2లో..

పిడిఎస్ బియ్యం పట్టివేత

473 మెట్రిక్ టన్నులు స్వాధీనం

ప్రజాశక్తి -గాజువాక : పేదలకు అందిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని షిప్పింగ్ కంపెనీల ద్వారా చేస్తున్న తరలింపును సర్కిల్ వన్ అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్ శ్రీహరి అడ్డుకున్నారు. దాడి చేసి వేర్వేరు చోట్ల 473 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రజా పంపిణీ ద్వారా పేదలకు అందాల్సిన బియ్యం పోర్టు ఏరియా ద్వారా అక్రమంగా రవాణా జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. వివిధ కంటైనర్ ఫ్రైట్ స్టేషన్లో తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా ఈ నెల 23న చినములగాడలో శ్రావణి షిప్పింగ్ సర్వీసెస్‌లో మూడు లారీలతో 115 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని గుర్తించారు. స్పాంజ్ ఎంటర్ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో మరో లారీలో ఉంచిన 35 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 24వ తేదీన షీలానగర్ టోల్‌గేటు వద్ద తనిఖీలు నిర్వహించగా 156 మెట్రిక్ టన్నుల అనుమానిత బియ్యంగా గుర్తించారు. మహారాష్ట్ర నాగపూర్‌కు చెందిన శ్రీరామ్ ఫుడ్ ఇండస్ట్రీ ద్వారా ఆరు కంటైనర్లలో ఈ బియ్యం సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. పంచవటి టోల్‌గేట్ వద్ద ఛత్తీస్‌ఘడ్ నుంచి 4 లారీల ద్వారా సరఫరా అవుతున్న మరో 167 మెట్రిక్ టన్నుల అనుమానిత బియ్యాన్ని గుర్తించి సాధించేసుకున్నారు. ఈ బియ్యం మొత్తం నమూనాలను ల్యాబ్‌కు అధికారులు పంపారు. ప్రస్తుతం డ్రైవర్లు నిగేష్ శ్రీవాత్సవ, నందకుమార్ సాహూ, గణేష్ కూల్, కుల్దార్ యాదవ్‌పై బిఎన్ఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు.

షిప్పింగ్ కంపెనీలో పట్టుబడిన లారీ

అదాని పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలి

▶ వార్త 5లో..

ప్రభుత్వం ప్రాథమిక విద్యను లేకుండా చేస్తోంది : చింతా మోహన్

▶ వార్త 8లో..

విపత్తులను ఎదుర్కొనేందుకు సమగ్ర ప్రణాళిక

▶ వార్త 8లో..

బాలికపై అత్యాచార కేసులో..

నిందితునికి ఇరవై ఏళ్ల జైలు

ప్రజాశక్తి -విశాఖ లీగల్ : బాలికపై అత్యాచారం కేసులో విశాఖ స్పెషల్ పోక్సో కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. నిందితునికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.1 లక్ష జరిమానా, బాధితురాలికి రూ.3 లక్షలు నష్టపరిహారంగా ఇవ్వాలని బుధవారం తీర్పు వెలువరించింది. జరిమానా చెల్లించని పక్షంలో మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని చిన్నపిల్లల లైంగిక వేధింపుల కేసులు విచారణ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి పైడి మంగాకుమారి తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసులో బాధితురాలి తరపున వాదనలు వినిపించిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తి రాజశేఖర్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి... 2018 జూన్ 9న, పద్మనాభ మండలం, రెడ్డిపల్లి గ్రామంలోని రెల్లిపేటలోని మామిడి తోటలో నిందితుడు బంగారు ఈశ్వరరావు ఆవులు మేపుతున్నాడు. అదే సమయంలో అటుగా పదేళ్ల బాధిత బాలిక ఆవును మేతకు తీసుకొచ్చింది. ఆ బాలికను నిందితుడు ఈశ్వరరావు సమీపంలోని తుప్పల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. కొంత సమయం తర్వాత బాధిత బాలిక పిన్ని మేకలను మేతకు తోలుకొని అదే ప్రాంతానికి వెళ్లింది. ఆ సమయంలో బాధిత బాలిక ఏడుస్తూ రక్తం కారుతున్న దుస్తులతో వచ్చింది. విషయం తెలుసుకున్న బాలిక పిన్ని వెంటనే ఇంటికి తీసుకెళ్లింది. జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు బాలిక చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పద్మనాభం పోలీసులు నిందితునిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం నేరాభియోగ పత్రం కోర్టులో దాఖలు చేశారు. విచారించి న్యాయమూర్తి నిందితుడిపై నేరం రుజువైనందున కఠిన శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం

చెత్త తొలగింపును పరిశీలిస్తున్న కేతన్‌గార్గ్

జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : విశాఖ నగర పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజారోగ్య అధికారులను జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. జివిఎంసి 21వ వార్డు పరిధి చినవాల్తేరులోని మసీదు వీధి, విజయనగర్ కాలనీ, నేతాజీ నగర్, కొయ్యవీధి, చిన్న వాల్తేర్ అన్న క్యాంటీన్ తదితర ప్రాంతాలలో బుధవారం కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలువలోని వ్యర్థాల తొలగింపు ప్రతిరోజు విధిగా చేపట్టాలని ఆదేశించారు. కొయ్య వీధి ప్రధాన కాలువలో పూడిక తీత పనులను పరిశీలించారు. వర్షాకాలంలో గెడ్డలు పొంగిపొర్లకుండా వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇఎన్‌వి.నరేష్‌కుమార్‌ను ఆదేశించారు. మసీద్ వీధిలోని కాలువలు, రోడ్లపై భవన నిర్మాణ వ్యర్థాలను గమనించి వాటిని యుద్ధ ప్రాతిపదికపై తొలగించి వాటి ఫొటోలను అప్‌లోడ్ చేయాలని ప్లానింగ్ కార్యదర్శిని ఆదేశించారు. కొత్తగా భవనాలు నిర్మిస్తున్న నిర్మాణదారులు వాటిని పూర్తిగా కప్పి ఉంచాలని, భవన నిర్మాణ సామాగ్రిని రోడ్లపై వేయకుండా భవనాల కాంపౌండ్ లోపల వేసేలా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ కె. శివప్రసాద్‌ను ఆదేశించారు. వీధుల్లో తాగునీరు సమస్య, వీధి దీపాల నిర్వహణపై స్థానిక ప్రజలనడిగి తెలుసుకున్నారు. ఫుట్ పాతులను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించరాదని వ్యాపారస్తులను ఆదేశించారు. రోడ్లపై మ్యాన్ హోల్లో

మిగతా 2లో..

ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలో వివిధ షాపులలో, గోడౌన్స్‌లో పనిచేస్తున్న ముఠా కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ ఇన్స్యూరెన్స్‌తో కూడిన సమగ్ర చట్టం చేయాలని విశాఖ జిల్లా ముఠా వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బారావు డిమాండ్ చేశారు. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో విశాఖ జిల్లా ముఠా వర్కర్స్ యూనియన్ 10వ మహాసభ బుధవారం జరిగింది. మహాసభల ప్రారంభంలో సిఐటియు పతాకాన్ని యూనియన్ గౌరవాధ్యక్షులు వై.రాజు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రతినిధుల సభలో గత మూడేళ్ల కాలంలో యూనియన్ చేసిన కార్యక్రమాల రిపోర్టును కార్యదర్శి ప్రవేశపెట్టగా సభ్యులు చర్చించి ఆమోదం తెలిపారు. అనంతరం మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల ముఠా కార్మికులకు ఉపాధికి రక్షణ లేకుండా పోతుందన్నారు. పనిలో ప్రమాదం జరిగితే కార్మికులకు ఏ విధంగానూ నష్టపరిహారం అందడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ముఠా కార్మికులకు లోడింగ్, అన్ లోడింగ్ కూలి రేట్లు పెంచాలని కోరారు. కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం కార్మికులకు నష్టం చేసే విధంగా చట్టాలను మార్పు చేసి నాలుగు లేబర్ కోడలుగా తీసుకువస్తుందన్నారు. ఈ లేబర్ కోడ్స్ అమలు జరిగితే కార్మికులు బానిసలుగా మారతారన్నారు. లేబర్ కోడ్స్ రద్దుచేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన జులై 9వ తేదీన చేపట్టే సమ్మెలో ముఠా కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ముఠా కార్మికుల యూనియన్ నాయకులు మాట్లాడుతూ, ముఠా కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, సమగ్ర చట్టం చేయాలని, సొంత ఇంటి నిర్మాణానికి అవసరమైన స్థలాలు కేటాయించాలని తీర్మానం చేశారు. అనంతరం రాబోయే మూడేళ్లకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా వై.రాజు, అధ్యక్షులుగా టి.పైడిరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎం.సుబ్బారావు, 20 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ముఠావర్కర్స్ యూనియన్ మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్

మొదటి పేజీ తరువాయి..

ప్రజాస్వామ్యంపై పెద్ద దాడి ఎమర్జెన్సీ

మాటలకు దాసోహం అయ్యారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి వాటాలను ఇవ్వకుండా రాష్ట్రాలు ఆర్థికంగా వెనక్కి నెడుతోందన్నారు. స్వతంత్ర సంస్థ అయిన ఎన్నికల కమిషన్‌ను కూడా కేంద్ర ప్రభుత్వం తన చేతిలో కీలుబొమ్మగా చేసిందన్నారు,. కేంద్రం మాటలు వినకపోతే ఎవరైనా సరే సిబిఐ ద్వారా కేసులు పెడుతున్నారని, ఎమర్జెన్సీ తర్వాత సిఎం స్థాయి వ్యక్తులను అరెస్టు చేసి జైల్లో పెట్టింది మోడీ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. ప్రతిపక్షాల మధ్య విభేదాలు రేకెత్తించే విధంగా విదేశాలకు వెళ్లే ప్రతిపక్ష పార్టీల కమిటీని కూడా కేంద్ర ప్రభుత్వమే నిర్ణయించిందన్నారు. ఈ సదస్సులో ఎమర్జెన్సీ కాలంలో ఉద్యమంలో పాల్గొన్న ఎస్.సుధాకర్, షిప్ యార్డు నాయకులుగా పనిచేసిన కుమార మంగళం, ఎమర్జెన్సీ కాలంలో ఆంధ్ర యూనివర్సిటీలో ఉపాధ్యాయునిగా పనిచేసిన రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం

వ్యర్థాలు పడకుండా జాలీలను అమర్చాలన్నారు. అనంతరం చిన్న వాల్తేరులోని అన్న క్యాంటీన్ పరిశీలించారు. ఈ పర్యటనలో జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇఎన్‌వి.నరేష్ కుమార్, ఎఎంఒహెచ్ బి.ప్రసాదరావు, కార్యనిర్వహక ఇంజినీరు గంగాధర్, సుధాకర్, పద్మావతి, ఉప కార్య నిర్వహక ఇంజినీరు వెల్సన్, ఎపిడి రాము, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి నీటి సరఫరా పైప్ లైన్ పూర్తి చేయండి

అనకాపల్లి జోన్‌లో చేపట్టిన ప్రధాన నీటి సరఫరా పైపులైన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు తాగునీటి సరఫరాను సకాలంలో అందించాలని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ తాగునీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనకాపల్లి జోన్, తుంపాల గ్రామంలో జివిఎంసి నీటి సరఫరా హెడ్ వాటర్ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. సెప్టెంబర్ 2025 నాటికి పూర్తి అయ్యేలా గుత్తేదారులను ఆదేశించారు.

అభివృద్ధి పనులకు హెచ్‌పిసిఎల్ రూ.8.75 కోట్ల విరాళం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: జిల్లాలో పలు అభివృద్ధి పనులు, అగ్నిమాపక వాహనాల కొనుగోలు నిమిత్తం హెచ్‌పిసిఎల్ సంస్థ జిల్లా యంత్రాంగానికి రూ.8.75 కోట్ల విరాళం ప్రకటించింది. ఈ మేరకు పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు సమక్షంలో జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్‌లతో సదరు సంస్థ ప్రతినిధులు కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం ఒప్పందం కుదుర్చుకున్నారు. పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని గుల్లలపాలెం, రామనగర్‌లో డ్రెయిన్లు నిర్మించేందుకు జివిఎంసికి రూ.8కోట్లు అందించింది. అలాగే ఆధునిక సదుపాయాలు కలిగిన మూడుమిస్ట్ అగ్నిమాపక యంత్రాలను కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగానికి రూ.75 లక్షల ఆర్థికసాయం అందజేసింది. సంబంధిత పత్రాలను మార్చుకున్న అధికారులు, వాటిపై సంతకాలు చేశారు. జిల్లా అభివృద్ధికి ముందుకొచ్చిన హెచ్‌పిసిఎల్ సంస్థ ప్రతినిధులకు విప్ గణబాబు, కలెక్టర్, జివిఎంసి కమిషనర్ ధన్యావాదాలు తెలిపారు. ఎంఒయుల కార్యక్రమంలో హెచ్‌ఆర్ సిజిఎం జి.కిరణ్‌కుమార్, ఈడి రామనాథన్ రామకృష్ణణ్, పిఆర్ఒ కాశీ నరసింహం పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గణబాబు సమక్షంలో ఎంఒయు పత్రాలను మార్చుకుంటున్న హెచ్‌పిసిఎల్ ప్రతినిధులు, అధికారులు

విశాఖలో కాగ్నిజెంట్ కొత్త క్యాంపస్

- రూ.1,580 కోట్లకు పైగా పెట్టుబడితో నిర్మాణం
- 8,000 ఉద్యోగాల కల్పన
- సిఇఒ రవికుమార్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: సాంకేతికత, వృత్తిపరమైన సేవలలో ప్రపంచ అగ్రగామి అయిన కాగ్నిజెంట్ విశాఖపట్నంలో సేట్-ఆఫ్-ది-ఆర్ట్ పేరుతో నూతన క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుందని కాగ్నిజెంట్ సిఇఒ ఎస్.రవికుమార్ తెలిపారు. బుధవారం విశాఖలోని ఓ ప్రయివేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నూతన క్యాంపస్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కాపులుప్పాడ, ఐటి హిల్స్‌లో 22 ఎకరాలు కేటాయించిందని, రూ. 1,583 కోట్ల పెట్టుబడితో ఈ క్యాంపస్‌ను మూడు దశల్లో అభివృద్ధి చేయనున్నామని తెలిపారు. తద్వారా 8వేల మందికి ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని, ఈ నూతన క్యాంపస్ ఎఐ సహాయంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తన క్లయింట్స్ కోసం డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ డెలివరీలో కాగ్నిజెంట్ యొక్క ఆధునిక సామర్థ్యాలను పెంచుతుందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర క్యాబినెట్ ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపిందన్నారు. 2026లో 800 మందితో తమ సంస్థ కార్యకలాపాలు ప్రారంభిస్తుందని తెలిపారు. విశాఖపట్నంలో కాగ్నిజెంట్ 2029 ప్రారంభంలో క్యాంపస్ మొదటిదశ పూర్తయ్యే వరకు ఒక తాత్కాలిక భవనంలో నుండి 800 మంది అసోసియేట్స్‌తో 2026 నుండి కార్యకలాపాలు ప్రారంభిస్తుందని తెలిపారు.

జిల్లా జడ్జిని కలిసిన జివిఎంసి కమిషనర్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజును జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ బుధవారం విశాఖపట్నం జిల్లా న్యాయమూర్తి కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో కలిసి పూల మొక్కను అందించారు. ఈ సందర్భంగా మహా విశాఖ నగర పాలక సంస్థకు సంబంధించి న్యాయపరమైన అంశాలను పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా న్యాయమూర్తిని కమిషనర్ కోరారు.

సమస్యలపై విఆర్‌ఎల ధర్నా

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బుధవారం గ్రామ రెవెన్యూ సహాయకులు (విఆర్‌ఎ) ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి విఆర్‌ఎల సంఘం విశాఖ జిల్లా గౌరవాధ్యక్షులు పి.వెంకటరావు మాట్లాడుతూ, రాష్ట్రంలోని 19300 మంది విఆర్‌ఎలు సమస్యల వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసినట్లు ఎపిలో విఆర్‌ఎలకు పే స్కేల్ అమలు చేయాలని కోరారు. మరో పక్క పార్ట్ టైం పేరుతో ఫుల్ టైం ఉద్యోగం చేయించుకుంటూ అక్రమంగా నైట్ వాచ్‌మ్యాన్ డ్యూటీలు వేస్తున్నారని, తక్షణం వాటిని రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. అర్హులైన గ్రామ రెవెన్యూ సహాయకులకు విఆర్‌ఒ, అటెండర్ ప్రమోషన్లు ఇవ్వాలని, జిల్లాలోని అర్హులతో సీనియార్టీ లిస్టు పెట్టాలని కోరారు. నామిని గ్రామ రెవెన్యూ సహాయకులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అటెండర్, నైట్ వాచ్‌మ్యాన్ ప్రమోషన్లు 20 శాతం నుంచి 70 శాతానికి పెంచాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని కోరారు. ధర్నా అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లి డిఆర్‌ఒ బిహెచ్.భవానీశంకర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు అలమండ సత్యం, పద్మనాభ మండలం కార్యదర్శి లింగాల సింహాచలం, ఆనందపురం మండల నాయకులు అప్పలరాజు, చిన్నారావు, పెందుర్తి మండల నాయకులు ఎల్లారావు, పెదగంట్యాడ మండల నాయకులు పి.పైడమ్మ పాల్గొన్నారు.

27 నుంచి కనెక్ట్ ఎపి ఎక్స్‌టెక్ సెమినార్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖలో ఈ నెల 27,28,29 తేదీల్లో నిర్వహిస్తున్న కనెక్ట్ ఎపి ఎక్స్‌టెక్ నాలుగో సెమినార్‌ను కేబుల్ ఆపరేటర్స్, ఇంటర్నెట్ ప్రొవైడర్స్, డిజిటర్ మార్కెటింగ్ ప్రతినిధులు, డిజిటల్ సాంకేతిక రంగ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సెమినార్ నిర్వాహకులు బండారు కృష్ణమూర్తి కోరారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సెమినార్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, లాసన్స్ బే కాలనీ గాదిరాజు ప్యాలస్‌లో సెమినార్ ఉంటుందన్నారు. ఈ ఎక్స్‌టెక్‌లో అత్యాధునిక టెక్నాలజీతో రూపొందిన అన్ని రకాల డ్రోన్స్, సిసి టీవీస్, స్ప్లిసింగ్‌మిషన్స్ ఇతర పరికరాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు ప్రాముఖ్యత గల వేదికను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో కేబుల్ ఆపరేటర్లు సుభద్రరాజు, గుంటూరు ప్రసాద్,చింతాడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న ఎక్స్ నిర్వాహకులు బండారు కృష్ణమూర్తి

గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి

మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒ నారాయణమూర్తి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచి స్వచ్ఛసర్వేక్షణలో రాష్ట్రంలోనే విశాఖ జిల్లాకు ప్రథమస్థానం వచ్చేలా అందరూ కృషి చేయాలని విశాఖ జిల్లా పరిషత్ సిఇఒ పి.నారాయణమూర్తి కోరారు. స్వచ్ఛసర్వేక్షణ్ గ్రామీణ 2025లో భాగంగా జిల్లా పరిషత్ సమావేశ భవనంలో బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వేటీం గ్రామాల్లో ఏమి పరిశీలన చేస్తారు, ఏ కేటగిరికి ఎన్ని మార్కులు ఇస్తారో తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ఎం.వి.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కెవివి చౌదరి మాట్లాడారు. ఎంపిడిఒలు, డిప్యూటీ ఎంపిడిఒలు, ఆర్ డబ్ల్యూఎస్ ఎఇలు , పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తల్లికి వందనానికి ని'బంధ'నాలు

మూడో వార్డు సచివాలయం వద్ద ఆరా తీస్తున్న తల్లులు

- అర్హులెందరికో అందని పథకం లబ్ధి
- లబ్ధిదారులకు వర్తించని కారణాలతో కోత
- సచివాలయాల చుట్టూ తల్లుల ప్రదక్షిణలు
- తుదిజాబితా కోసం ఆశగా ఎదురుచూపులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం పథకం కింద లబ్ధి చేకూరుస్తామన్న కూటమి ప్రభుత్వం మాటలకు చేతలకు ఎక్కడా పొంతన లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వం అమలు చేసిన నిబంధనలనే కొనసాగిస్తున్నామంటూ, ఎందరో అర్హులకు ఈ పథకం కింద సాయం అందజేయకపోవడంపై ఆందోళన వ్యక్తమౌతోంది. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు విద్యాశాఖ మంత్రి లోకేష్ ఎన్నికల ముందు, తర్వాత ఇచ్చిన హామీలను గుర్తుచేసుకుని, అమలుకు వచ్చేసరికి కొందరికి మొండిచేయి చూపడంపై మండిపడుతున్నారు. ఒక్కొక్కరికీ రూ.15వేలు చొప్పున ఇస్తామంటూ, గత ప్రభుత్వం చేసిందంటూ అప్పటిలాగే రూ. రెండు వేలు కోత పెట్టి, రూ.13వేలు చొప్పున చేతిలో పెట్టడంతో దొందూదొందేనని పలువురు ఆరోపిస్తున్నారు. అర్హులై ఉండి లబ్ధి చేకూరని విద్యార్థుల తల్లులు సచివాలయాలు, తమ అర్హత ధ్రువీకరణలను పట్టుకుని ప్రదక్షిణలు చేస్తున్నారు.

సచివాలయాల చుట్టూరా ప్రదక్షిణలు

అర్హులైనప్పటికీ తల్లికి వందనం పథకం కింద ఆర్థికసాయం అందని విద్యార్థుల తల్లిదండ్రులు కారణాలేంటో తెలుసు కోవడానికి, వాటిని సరిచేసుకుని మళ్లీ దరఖాస్తులివ్వడానికి వార్డు, గ్రామ సచివాలయాలు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అలానే ఖాతాల్లో జమ అయ్యాయో, లేదో అని బ్యాంక్‌లు, పోస్టాఫీసు ల చుట్టూ తిరుగుతున్నారు. అనర్హుల జాబితాలో పేర్లు చేర్చడంతో అందుకు కారణాలను తెలుసుకుని దానికి తగ్గ ఆధారాల సమీకరణకు నానా అవస్థలు పడుతున్నారు. ఇంతచేస్తున్నా మొదటి జాబితాలో తప్పిపోయిన తమకు తల్లికి వందనం దక్కనట్టేనన్న నిరాశతో వారంతా ఆవేదన చెందుతున్నారు.

అనర్హతకు కారణాలివే

నాలుగు చక్రాల వాహనం కలిగి ఉండడం, నెలసరి విద్యుత్ వినియోగం సగటున 300 యూనిట్ల కంటే ఎక్కువగా ఉండడం, ఆదాయపు పన్ను చెల్లించిన వారు, కుటుంబంలో ఉద్యోగస్తులున్నవారు, మెట్ట భూమి 10 ఎకరాలు అంత కంటే ఎక్కువ ఉండడం, పట్టణాల్లో 1000 చదరపు అడుగుల విస్తీర్ణం గల ఇళ్ళు, లేదా స్థలం కలిగి ఉండడం, కుటుంబ నెలవారీ ఆదాయం గ్రామీణంలో రూ 10 వేలు, పట్టణాల్లో రూ 12 వేలు మించితే పథకం వర్తించదు.

ఇలా చేయడం తగునా?

తన పేరున ఇల్లు, కరెంట్ మీటర్ లేకున్నా ఉన్నట్టు చూపి తల్లికి వందనం పథకానికి అనర్హులు చేశారని జివిఎంసి ఒకటో వార్డు సంత పేటకు చెందిన ఓ మహిళ ప్రజాశక్తి వద్ద వాపోయింది. ప్రయివేటు ఆసుపత్రిలో తక్కువ జీతానికే పనిచేస్తూ, అద్దె ఇంట్లో ఉంటున్న తనకూ పథకం వర్తించలేదని అదే ప్రాంతానికి చెందిన మరో మహిళ వాపోయారు. నెలకు రూ.12వేలు వేతనంతో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుండడం వల్లే తల్లికి వందనం వర్తించలేదని ఒకటో వార్డు సచివాలయం ఉద్యోగి చెప్పడంతో ప్రైవేట్ సెక్యూరిట్ గార్డు ఆవేదన వ్యక్తం చేశారు తమ పిల్లాడు తొమ్మిదో తరగతి చదువుతున్నా తమకు తల్లికి వందనం డబ్బులు జమ కాలేదని ఓ టైలర్ ఆవేదనతో చెప్పారు. . ఇలా ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న జివిఎంసి, పంచాయతీ పారిశుధ్య కార్మికులదీ ఇదే పరిస్థితి. తల్లికి వందనం లబ్ధి అందలేదో మూడో వార్డు పరిధిలోని విద్యార్థుల తల్లులు సంబంధిత సచివాలయం వద్దకు రావడం కనిపించింది. ఇప్పటికైనా తమ అర్హతలను పరిశీలించి తమకు తల్లికి వందనం పథకం కింద ఆర్థికసాయం అందజేయాలని అర్హులైన ఎందరో విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. ఇప్పటికే వారంతా దరఖాస్తు చేసుకోగా, నెలాఖరులోగా పరిశీలన జరిపి, వచ్చేనెల 5న ప్రకటించే తుది జాబితాలో తమ పేరు ఉంటుందని ఎంతో ఆశగా, ఆత్రంగా ఎదురుచూస్తున్నారు.

రైతులకు రాయితీపై ఉద్యానవన పథకాలు

ప్రజాశక్తి- ఆనందపురం : రైతుల ఆదాయాన్ని పెంచడం, సాగు విధానాలను ఆధునీకరించడం లక్ష్యంగా ఉద్యాన శాఖ రైతులకు అనేక రాయితీ పథకాలను అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి సోనియా తెలిపారు. కూరగాయలు, పండ్ల తోటలు, పువ్వులు, నిల్వ గదులు వంటి విభాగాల్లో పలు ప్రోత్సాహక పథకాలను అందుబాటులో ఉన్నాయన్నారు. ఆధునిక పద్ధతుల్లో ఉద్యానవన పంటల సాగుతో మేలు జరుగుతుందన్నారు. రాయితీ పథకాలను వివరాలను వెల్లడించారు

హైబ్రిడ్ కూరగాయల సాగుకు హెక్టార్‌కు గరిష్ఠంగా రూ.24వేలు చొప్పున ఒక్కో రైతులకు రెండు ఎకరాలపై 40 శాతం రాయితీ అందుబాటులో ఉందన్నారు. హైబ్రిడ్ విత్తనాల కొనుగోలుకు 50 శాతం రాయితీ, శాశ్వత పందిళ్ల ఏర్పాటుకు 50 శాతం రాయితీతో ఒక్కో రైతుకు హెక్టారు విస్తీర్ణానికి రూ..2.5 లక్షలు రాయితీ వర్తింపు, ట్రెల్లిస్‌కు 50శాతం రాయితీతో హెక్టారుకు రూ.18, 750, మల్ఫింగ్‌కు హెక్టార్‌కు రూ.16వేలు, గులాబీ, చామంతి, మల్లె విడిపూల సాగుకు 40శాతం రాయితీతో హెక్టార్‌కు రూ.20వేలు, పండ్ల తోట విస్తరణకు మామిడికి రూ.50 వేలు, జామకు రూ.80వేలు, బొప్పాయికి రూ.30వేలు, అరటికి రూ.70వేల వరకు రాయితీ వర్తిస్తుందన్నారు.

తోట వద్ద ఉత్పత్తుల సేకరణ, గ్రేడింగ్, నిల్వకు 75 శాతం రాయితీతో యూనిట్‌కు గరిష్ఠంగా రూ.11.25 లక్షలు, ఉత్పత్తుల ప్యాకింగ్‌కు 50 శాతం రాయితీతో యూనిట్‌కు రూ.2 లక్షలు. సౌరశక్తి ఆధారిత కోల్డ్ రూమ్స్‌కు 35 శాతం రాయితీతో 30 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉంటే రూ.18.20 లక్షలు, 10 మెట్రిక్ టన్నులకు రూ.4.38 లక్షలు, విద్యుత్, సోలార్ కలిపిన విధానానికి రూ.5.25 లక్షలు మంజూరు చేస్తారన్నారు. మరిన్ని వివరాలకు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'బెస్ట్ అవైలబుల్' విద్యార్థులకు న్యాయం చేయండి

డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న సంఘం నేతలు

ప్రజాశక్తి - అరిలోవ : ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు గతంలో అందుబాటులో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, షూస్, ఇతర కిట్ అందజేసి న్యాయం చేయాలని దళిత హక్కుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. బుధవారం దళిత హక్కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, నిరుపేద విద్యార్థులకు గతంలో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని గత ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. అప్పట్లో దీన్ని కొనసాగించాలని పోరాటం చేసినా అప్పటి ప్రభుత్వం స్పందించలేదన్నారు. దీంతో దళిత హక్కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించారన్నారు. దీనిపై స్పందించిన న్యాయస్థానాలు జిఒ 61 ప్రకారం ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కూల్ ఎటువంటి మార్పు చేయకుండా కొనసాగించాలని, ఇప్పటివరకు ఉన్న బకాయిలను పాఠశాల యాజమాన్యాలకు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తీర్పునిచ్చిందన్నారు దీనికి అనుగుణంగా పథకాన్ని నిర్వహిస్తున్నప్పటికీ, దీని ద్వారా ప్రయివేటు కార్పొరేట్ పాఠశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఈ ఏడాది పుస్తకాలు, షూస్,ఇతర కిట్ అందజేయలేదన్నారు. దీనిపై అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరిగినా స్పందన లేదన్నారు. డిఇఒ వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై డిఇఒ ప్రేమ్‌కుమార్ స్పందిస్తూ, ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడి, వెంటనే ఆయా విద్యార్థులకు పుస్తకాలు, కిట్లు ఇవ్వాలని ఆదేశించగా, గురువారం నుంచిఇస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు చింతాడ జోగారావు, కనకరాజు, కనకమహాలక్ష్మి, త్రినాథ్, నాగరాజు ప్రసాదు, తదితరులు పాల్గొన్నారు.

సంస్థాగత ఎన్నికల పరిశీలకునిగా దాసరి

దాసరి శ్రీనివాస్

ప్రజాశక్తి -మధురవాడ : అనకాపల్లి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల పరిశీలకునిగా రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి శ్రీనివాస్‌ను పార్టీ అధిష్టానం నియమించింది. తనపై ఎంతో నమ్మకంతో రాష్ట్ర పార్టీ, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అప్పగించిన బాధ్యతను సమర్ధ వంతంగా నిర్వహిస్తానన్నారు. రాష్ట్ర మంత్రి లోకేష్, ఎమ్మెల్యే గంటాకు కృతజ్ఞతలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి -గాజువాక : సీజనల్ వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని జివిఎంసి గాజువాక జోన్ శానిటరీ సిబ్బంది సూచించారు. బుధవారం 74వ వార్డు దయాల్ నగర్‌లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. చెత్త వేసే ప్రదేశాలను గుర్తించి, తడి చెత్త పొడి చెత్త సేకరణ, వేరు చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పలరాజు, సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు, సూపర్వైజర్స్,ప్రజలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని కొత్త అచ్చెర్ల గ్రామంలో ఈ నెల 16న జరిగిన చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడిని బుధవారం అరెస్ట్ చేసినట్లు అనకాపల్లి డిఎస్‌పి ఎం.శ్రావణి తెలిపారు. బుధవారం కేసు వివరాలను వెల్లడించారు. కొత్త అచ్చెర్ల గ్రామంలో ఈ 16న సాయంత్రం ఇంటి ముందు గడ్డి కోస్తున్న ఓ మహిళ మెడలో బంగారు తాడును గుర్తించిన పాయకరావుపేట మండలం సత్యవరం గ్రామానికి చెందిన యువకుడు శీలం కార్తిక్ అనే నిందితుడు రాజాం వెళ్ళే దారి గురించి అడుడుతూ, ఆమెను మాటల్లో పెట్టి, మెడలోని బంగారుతాడును లాక్కొని పరారయ్యాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలు, సిసిటివి ఫుటేజ్ దర్యాప్తు చేపట్టారు.బుధవారం విశాఖపట్నంలో తాడు అమ్మేందుకు వెళుతుండగా బయ్యవరం వద్ద నిఘా ఉంచిన పోలీస్ బృందం నిందితుడు కార్తిక్‌ను అరెస్టు చేశారు. ఆయన నుంచి బైక్, బంగార తాడును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ప్రైవేటు కంపెనీలో పనిచేసి మానివేసి బెట్టింగులకు అలవాటు పడి, అప్పుల్లో కూరికిపోవడంతో డబ్బు కోసం ఈ దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. కార్యక్రమంలో కశింకోట సిఐ అల్లు స్వామినాయుడు, ఎస్‌ఐలు కె.లక్ష్మణరావు, పి.మనోజ్ కుమార్, కానిస్టేబుళ్లు డి.గోపి, శ్రీనివాస్, మహేష్, మూర్తి పాల్గొన్నారు.

1,246 మద్యం సీసాలు స్వాధీనం

- ఇద్దరు అరెస్ట్ - రెండు బైక్‌ల సీజ్

ప్రజాశక్తి-పాయకరావుపేట: పాయకరావుపేట ఎక్సైజ్ అధికారుల దాడుల్లో బుధవారం 1246 అక్రమ మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి, రెండు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. దీనికి సంబంధించి పాయకరావుపేట ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జి శ్రీనివాసు తెలిపిన వివరాలివి.

మండలంలోని కేశవరం సమీపంలో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పెట్రోలింగ్ చేస్తూ ఉండగా ఇద్దరు వ్యక్తులు 96 మద్యం సీసాలతో పట్టుబడ్డారు. వీరిని కాకినాడ జిల్లా, గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామం, తుని పట్టణంలోని రామకృష్ణా కాలనీకి చెందిన వ్యక్తులుగా గుర్తించారు. వీరిని విచారించి సేకరించిన వివరాల ఆధారంగా చేబ్రోలు గ్రామంలో దాచిపెట్టిన మరో 1150 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో అనకాపల్లి, యానాంకు చెందిన మరో ఇద్దరు నిందితుల ప్రమేయం ఉన్నట్లు గుర్తించి వారికోసం గాలిస్తున్నట్లు సిఐ శ్రీనివాస్ తెలిపారు. అక్రమ మద్యాన్ని యానాంకు చెందిన వ్యక్తి సరఫరా చేస్తుండగా, తాటిపర్తికి చెందిన వ్యక్తి, చేబ్రోలులో నిల్వ ఉంచి వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. నిందితులను అరెస్ట్ చేసి యలమంచిలి కోర్టుకు రిమాండ్‌కు తరలించారు. దాడుల్లో పాయకరావుపేట ఎక్సైజ్ కానిస్టేబుళ్లు డి నాగేశ్వరరావు, ఆర్ జగన్నాథ, జె నాగ ప్రసాద్, ఎన్ దుర్గ ప్రసాద్ పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మాధవధార సచివాలయంలో పనిచేస్తున్న కమలకుమారి శుభకార్యం నిమిత్తం విజయవాడ వెళ్లి ఈ నెల 22వ తేదీ సాయంత్రం విశాఖ తిరిగి వస్తుండగా బ్యాగులోని 4.5 తులాల బంగారు గొలుసులు 3, బంగారు గాజులు-2, రూ.2.50 లక్షల నగదు చోరీకి గురైనట్లు ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైమ్ సిఐ చక్రధరరావు ఆధ్వర్యాన ఎస్ఐ అప్పలరాజు విచారణ చేపట్టారు. మద్దిలపాలెం ఆర్‌టిసిలో కాంట్రాక్టు హెల్పర్‌గా పనిచేస్తున్న మొల్లి వెంకటేష్, సూపర్‌వైజర్ భారటం వెంకట రమణపై అనుమానం వచ్చి అదుపులోకి తీసుకొని విచారించారు. నేరం రుజువు కావడంతో వారిని అరెస్టు చేశారు. వారి నుంచి చోరీకి గురైన బంగారు గొలుసులు 3 బంగారు గాజులు 2, రూ.50 వేలు నగదును స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేధించిన ఎస్ఐ అప్పలరాజును, హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ, కానిస్టేబుల్ హరిప్రసాద్, జగత్ కిరణ్‌లను పోలీసు ఉన్నధికారులు అభినందించారు.

నేత్రపర్వంగా అప్పన్న గరుడసేవ

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం వరాహలక్ష్మీ నసింహ స్వామి గరుడ సేవ బుధవారం నేత్రపర్వంగా సాగింది. ఆర్జిత సేవల్లో భాగంగా ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని మండపంలో అధిష్టింపజేసి, వేడుకను జరిపించారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

జివిఎంసి కొత్త కమిషనర్‌కు
కార్పొరేటర్ల అభినందన

కమిషనర్‌ను కలిసిన ఏడో వార్డు కార్పొరేటర్ మంగమ్మ

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఏడో వార్డు పరిధిలోని పలు కాలనీలు, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేసి వార్డును అభివృద్ధికి సహకరించాలని కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం నిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు కోరారు. బుధవారం జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ముందుగా కొత్త కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. చంద్రంపాలెం ఉన్నత పాఠశాల వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులు వెంటనే ప్రారంభించాలని, పలు కాలనీల్లో అంతర్గత రహదారులు, డ్రైనేజీలను అభివృద్ధి చేయాలని కోరారు.

గాజువాక : జివిఎంసి కొత్త కమిషనర్ కేతన్‌గార్గ్‌ను బుధవారం 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు మర్యాద పూర్వకంగా కలిశారు. వార్డులో చేపట్టిన, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల వివరాలను కమిషనర్‌కు వివరించారు. వార్డు పర్యటనకు రావాలని ఆహ్వానించారు. మెట్ల మార్గాల పునరుద్ధరణ, కాలువలు, రోడ్ల అభివృద్ధి చేపట్టాలని కోరారు.

ములగాడ : జివిఎంసి నూతన కమిషనర్ కేతన్‌గార్గ్‌ను పశ్చిమ నియోజకవర్గ జనసేన యూత్ నాయకుడు పుర్రె సురేష్‌యాదవ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. పారిశ్రామిక ప్రాంతంలో సమస్యలపై విన్నవించి, పరిష్కారానికి సహకరించాలని కోరారు.

వైసిపి వార్డు అధ్యక్షునిగా రామ్మోహన్

విజయప్రసాద్‌తో రామ్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 61వ వార్డు వైసిపి అధ్యక్షునిగా పిలక రామ్మోహన్ రెడ్డి ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ సమక్షంలో నిర్వహించిన సమావేశంలో రామ్మోహన్‌ను పార్టీ కేడర్ ఎన్నుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి వార్డు అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టబడి పనిచేస్తానన్నారు. తనపై విశ్వాసముంచిన మళ్ల విజయప్రసాద్‌కు ధన్యవాదాలు తెలిపారు

జగన్‌ను కలిసిన సమన్వయకర్తలు



జగన్‌తో జిల్లా అధ్యక్షుడు కెకె.రాజు, వైసిపి సమన్వయకర్తలు

ప్రజాశక్తి -సీతమ్మధార : వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం పార్టీ అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షుడు కెకె.రాజు ఆధ్వర్యంలో అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు పాల్గొన్నారు. సమావేశం అనంతరం వారంతా మర్యాదపూర్వకంగా జగన్మోహన్ రెడ్డిని కలిశారు. పార్టీ జిల్లా పార్టీ అధ్యక్షులు కె.కె రాజు ఆధ్వర్యంలో సమన్వయకర్తలు చిన్న శ్రీను, వాసుపల్లి గణేష్ కుమార్, మళ్ల విజయప్రసాద్,తిప్పల దేవన్ రెడ్డి, మొల్లి అప్పారావు తదితరులు జగన్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

సార్వత్రిక సమ్మె జయప్రదానికి
సిఐటియు విస్తృత ప్రచారం

సమస్యలపై నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా వచ్చేనెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. మద్రిపాలెం జ్యోతినగర్‌లో మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు వేతనాలు, ఇతర సమస్యలపై నిరసన చేపట్టారు. మున్సిపల్ కార్మికుల వేతన బకాయి చెల్లించాలని, లేబర్ కోడ్స్‌ను రద్దుచేసి, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మికులను బానిసలుగా మార్చేందుకు తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నంలో మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు చెల్లించడం లేదని, స్టీల్‌ప్లాంట్‌లో నాలుగు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను నిర్ధాక్షిణ్యంగా తొలగించారన్నారు. సమ్మె జయప్రదంతో కార్మికశక్తిని పాలకులకు తెలియజెప్పాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం, సిఐటియు జోన్ సెక్రటరీ ఒ అప్పారావు,జోన్ నాయకులు ఎస్ శ్రావణ్ కుమార్, 53 వ వార్డు నాయకులు ఎం నూకరాజు, రామప్పుడు, రమణమ్మ, ధనలక్ష్మి, పార్వతి పాల్గొన్నారు

కేన్సర్ విజేతలతో అపోలో కెన్ విన్ గ్రూప్

కేన్సర్ విజేతలతో కెన్ విన్ గ్రూప్‌ను ప్రంభిస్తున్న అపోలో అంకాలజిస్ట్‌లు

ప్రజాశక్తి - ఆరిలోవ : క్యాన్సర్ వ్యాధిని సమర్ధవంతంగా ఎదుర్కోవడానికి, రోగుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి అపోలో ఆసుపత్రి యాజమాన్యం 'కెన్‌విన్' పేరుతో ఒక వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కేన్సర్ విజేతల మాసోత్సవాన్ని పురస్కరించుకొని చిరునవ్వుతో కేన్సర్ జయించాలి అనే లక్ష్యంతో బుధవారం ఆరిలోవ కేన్సర్ ఆస్పత్రిలో 'కెన్ విన్' గ్రూప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో అపోలో వైద్యబృందం మాట్లాడుతూ కేవలం వైద్యంతోనే కాకుండా వ్యాధిగ్రస్తుల్లో కేన్సర్ పట్ల అవగాహన, వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడం ద్వారా రోగ నివారణ సులభతరం అవుతుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని అపోలో కేన్సర్ వైద్యబృందం కేన్సర్ విజేతలతో కెన్‌విన్ అనే వాట్సప్ గ్రూపును ప్రారంభించిందన్నారు. ఈ గ్రూపులో చేరిన వారు కేన్సర్ వ్యాధిపై సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు ఉచితంగా వైద్య సలహాలు, వైద్యులతో సంప్రదింపులు జరపడం, కేన్సర్ విజేతల అనుభవాలను తెలుసుకోవడానికి వీలుపడుతుందన్నారు. కేన్సర్ అనుమానితులు, ఈ వ్యాధి నుండి బయటపడిన వారు ఉచితంగా ఈ గ్రూపులో చేరి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. ఈ గ్రూపులో చేరాలనుకునేవారు క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా, లేదా నేరుగా ఆసుపత్రిని గానీ, లేదా 0891-2727272,0891-2867777 ఫోన్‌కు సంప్రదించి కెన్‌విన్ గ్రూపులో చేరొచ్చని సూచించారు.కార్యక్రమంలో అపోలో ఆస్పత్రిలో వైద్యం పొంది కేన్సర్‌ను జయించిన గాయత్రి కృష్ణ, రామ్మోహనరావు, సాత్విక్ రామ్ తమ అనుభవాలను వెల్లడించారు.అపోలో ఆంకాలజీ వైద్యులు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అపోలో కేన్సర్ ఆస్పత్రి ఆంకాలజిస్ట్‌లు డాక్టర్ రాకేష్ రెడ్డి, డాక్టర్ వి ప్రదీప్, డాక్టర్ సుమన్ దాస్, యూనిట్ హెడ్ డాక్టర్ బ్రహ్మాజీ నాయుడు పాల్గొన్నారు.

ఖాళీ జాగాపై కోస్ట్‌గార్డ్ కన్ను!

పోర్టు ఆధీనంలో ఉన్న ఖాళీ స్థలం

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 62వ వార్డు మల్కాపురం గాంధీజీ వీధి, ప్రకాష్ నగర్ ఆనుకొని ఉన్న సుమారు 4.80 ఎకరాల విశాఖపట్నం పోర్టు ట్రస్టు ఆధీనంలో ఉన్న స్థలంపై కోస్ట్‌గార్డ్ కన్నుపడినట్లు కనిపిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ స్థలంలో జివిఎంసి ఆధ్వర్యంలో క్రీడా మైదానం, పార్క్ నిర్మాణం చెయ్యాలని స్థానిక ప్రజా ప్రతినిధులకు కొన్నేళ్లుగా మల్కాపురం, ప్రకాశ్‌నగర్ వాసులు వినతిపత్రాలు ఇచ్చారు. ఇటీవల జరిగిన గ్రామసదస్సులోనూ జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే పి.గణబాబుకు మల్కాపురం గ్రామ సంక్షేమ సంఘం పెద్దలు లిఖిత పూర్వకంగా విన్నవించారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే గణబాబు కూడా స్థానికులకు స్పష్టమైన హామీనిచ్చారు. దీంతో ఈ స్థలంలో పార్కు, క్రీడామైదానం ఏర్పడుతుందని స్థానికులు, ముఖ్యంగా ఎంతో ఆశపడ్డారు. ఇదిలా ఉంటే ఈ స్థలాన్ని కోస్టుగార్డు స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో సర్వే కూడా చేయడంతో విషయం తెలుసుకున్న స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఎమ్మెల్యే గణబాబుతోపాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు దీనిపై జోక్యం చేసుకోవాలని, ఖాళీజాగాను కోస్టు గార్డుకు ఇవ్వకుండా స్థానిక ప్రజల సామాజిక అవసరాలకు ఉపయోగించాలని వేడుకుంటున్నారు. ఎన్నాళ్ల నుంచో స్థానికులు కోరుతున్న విధంగా జివిఎంసి ఆధ్వర్యంలో పార్కు, క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.అ వసరమైతే దీనిపై కలిసికట్టుగా ఉద్యమించాలని 61,62,వ వార్డుల పెద్దలు, యువత నిర్ణయించారు.

ఐటిఐలో వికలాంగులకు ప్రవేశాలు

ప్రజాశక్తి-మధురవాడ : బక్కన్నపాలెంలోని ఏపి విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ, శిక్షణ, ఉత్పత్తి కేంద్రం, ఐటిఐలో 2025-26 విద్యా సంవత్సరానికి వికలాంగ పురుష అభ్యర్థులకు ప్రవేశాలకు ఈ నెల 20 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రాజెక్టు అధికారిణి కె.కవిత బుధవారం తెలిపారు. కార్పెంటర్ ట్రేడులో 24, షీట్ మెటల్ వర్కర్ 20, వెల్డర్ ట్రేడులో 20 మొత్తం 64 సీట్లు ఉన్నాయన్నారు. అర్హులైన వారికి ఏడాది పాటు ఉచితంగా శిక్షణ, భోజనం, వసతి సౌకర్యాలు, ఏక రూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు కల్పిస్తామన్నారు. ఈ సెంటర్‌లో రాష్ట్రంలోని 26 జిల్లాల వికలాంగ యువత ప్రవేశం పొందవచ్చునన్నారు. వచ్చేనెల 15వరకు iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరా లకు ప్రాజెక్టు అధికారిణి కె.కవిత (90000 13610), ప్రిన్సిపాల్ సి హెచ్ భాస్కరరావు (73964 24319), రాజబాబు (95021 23060) లను సంప్రదించాలని సూచించారు.

పారదర్శకంగా ఎఎన్‌ఎంల బదిలీలు

డిఎంహెచ్‌ఒ డాక్టర్ జగదీశ్వరరావు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎఎన్‌ఎంల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా, క్రమబద్ధంగా జరుగుతోందని డిఎంహెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. బదిలీల ప్రక్రియకు సంబంధించి ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు సంబంధించిన ఎఎన్‌ఎంల ధ్రువీకరణల పరిశీలన పూర్తి చేసి అప్పగించామన్నారు. వారికి పోస్టింగ్ ఆర్డర్లు అందజేస్తామని డిఎంహెచ్ఒ డాక్టర్ జగదీశ్వరరావు తెలిపారు.

వైద్యాధికారులు బాధ్యతల స్వీకరణ

డాక్టర్ స్వప్న

ప్రజాశక్తి తగరపువలస : భీమిలి మండలం ఆర్ తాళ్లవలస పిహెచ్‌సి వైద్యాధికారిగా డాక్టర్ కె స్వప్న బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. పద్మనాభం మండలం రేవిడి పిహెచ్‌సి నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన వైద్యాధికారి డాక్టర్ ఎబి మల్లికార్జునరావు విజయనగరం టెంపరరీ హాస్పిటలైజేషన్ వార్డుకు బదిలీపై వెళ్లారు.

డాక్టర్ శ్రీనివాస్

గాజువాక : గాజువాక పిహెచ్‌సి వైద్యాధికారిగా డాక్టర్ శ్రీనివాస్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. మన్యం పార్వతీపురం జిల్లా గలవల్లి పిహెచ్‌సి నుంచి గాజువాక బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన డాక్టర్ సుధాకర్‌ను తుమ్మపాల పిహెచ్‌సికి బదిలీ చేయగా, రిలీవయ్యారు.

చంద్రబాబును కలిసిన తాతారావు

ముఖ్యమంత్రితో డిసిసిబి ఛైర్మన్ కోన

ప్రజాశక్తి- గాజువాక : ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడును విశాఖ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ కోన తాతారావు బుధవారం విజయవాడ సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు .ఈ సందర్భంగా సహకార సంఘాల ద్వారా రైతాంగానికి మెరుగైన సేవలు అందించాలని, పిఎసిఎల్‌లు, డిసిసిబి బ్రాంచ్‌ల ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా పనిచేయాలని చంద్రబాబు సూచించారని తాతారావు తెలిపారు.

అదాని పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలి

సిపిఎం నేతలు కోటేశ్వరరావు, వెంకన్న

ప్రజాశక్తి-అనకాపల్లి, దేవరాపల్లి

అదాని కంపెనీ అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో నిర్మించనున్న రెండు పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టుల సామర్థ్యాన్ని పెంచుకునేందుకు పెట్టిన అభ్యర్థనను రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించడాన్ని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న బుధవారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. శారద నది పరీవాహక ప్రాంతంలో పెదకోట వద్ద 1000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 1800 మెగావాట్లకు, రైవాడ జలాశయ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 600 నుంచి 900 మెగావాట్లకు పెంచాలని అదాని హైడ్రో ఎనర్జీ కంపెనీ విన్నవించిందని పేర్కొన్నారు. అడిగిందే తడవుగా రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించడం చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం అదానికి ఎంతగా దాసోహం అవుతుందో అర్థమౌతుందన్నారు.

అల్లూరి జిల్లా అనంతగిరి మండలం ఐదో షెడ్యూల్ ప్రాంతంలోని పెదకోట వద్ద 1000 మెగావాట్లు, రైవాడ జలాశయం పైభాగంలో 600 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కోసం అదాని కంపెనీకి గత ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని తెలిపారు. శారద నది పరీవాహక ప్రాంతమైన పెదకోట ప్రాంతంలో పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు నిర్మిస్తే రాబోయే కాలంలో విశాఖ నగర ప్రజల తాగునీటికి, రైవాడ, పెద్దేరు, కోనాం జలాశయాల ఆయకట్టుకు నీరు అందకుండా పోతుందని నీటిపారుదల శాఖాధికారులు గత ప్రభుత్వంలో నివేదించారని గుర్తు చేశారు. వారి మాటలను పట్టించుకోని గత వైసిపి ప్రభుత్వం పీకమీద కత్తిపెట్టి ఫీజిబులిటీ సర్టిఫికెట్ ఇవ్వాలని గడువు విధించడంతో ఒత్తిడి భరించలేక ప్రభుత్వానికి నివేదిక సమర్పించారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పొరపాట్లను సరిదిద్దకుండా టిడిపి కూటమి ప్రభుత్వం పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టుల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి సిద్ధపడడమంటే రైతాంగానికి, ప్రజలకు తీరని ద్రోహం చేయడమే అవుతుందన్నారు. పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టులతో రైతాంగానికి, ప్రజల తాగునీటికి తీవ్ర విఘాతం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివాసీ తెగలు జీవనోపాధిని కోల్పోయే అవకాశం ఉందన్నారు. షెడ్యూల్డ్ ఏరియాలో ప్రాజెక్టు నిర్మాణం 1/70, పీసా, అటవీ హక్కుల చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాలలో ప్రైవేట్ సంస్థలు ప్రాజెక్టులను చేపట్ట రాదని సుప్రీంకోర్టు 1997 సమతా కేసులో ఇచ్చిన తీర్పును గుర్తు చేశారు. ఆదివాసీలను, పేదలను వారి ఆవాసాల నుంచి వెళ్లగొట్టేందుకు ప్రయత్నం చేయడం దారుణమన్నారు. అదాని మనుషులు చింతలపూడి, మారిక గ్రామాలను ఖాళీ చేయించే ప్రయత్నాన్ని గిరిజనులు ప్రతిఘటించింటే అదాని ప్రాజెక్టును రద్దు చేయకపోగా, సామర్థ్యం పెంపునకు రాష్ట్ర ప్రభుత్వ కేబినెట్ ఆమోదం తెలపడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అదాని కంపెనీకి చెందిన పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టుల అనుమతులను తక్షణమే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. మారిక, చింతలపూడి గ్రామాల వారి ప్రతిఘటనను స్ఫూర్తిగా తీసుకొని రైవాడ ఆయకట్టు రైతులు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. లేదంటే రైవాడ ఆయకట్టు భూములు పూర్తిగా బీడు బారి పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న జివిఎంసి కమిషనర్

కలెక్టర్‌ను కలిసిన జివిఎంసి కమిషనర్

ప్రజాశక్తి-అనకాపల్లి : మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కేతన్ గార్గ్ బుధవారం అనకాపల్లి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జివిఎంసికి సంబంధించి కార్యకలాపాలు, అనకాపల్లి జోనల్ పరిధిలోని పరిపాలన పరమైన అంశాలపై ఇరువురు చర్చించుకున్నారు.

వడ్డాది పిహెచ్‌సి డాక్టర్‌గా మాధవీలత

బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ మాధవీలత

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్‌గా కె.మాధవీలత మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ శకుంతల దేవరాపల్లి మండలం వేచలం పిహెచ్‌సికి బదిలీపై వెళ్లారు. మాధవీలత సింహాచలం ఆర్‌హెచ్‌సి ఆసుపత్రి నుండి ఇక్కడకు వచ్చారు. సందర్భంగా డాక్టర్ మాధవీలత మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని చెప్పారు. సీజనల్ వ్యాధులపై ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

పెద్ద పెద్ద గోతుల్లో వర్షపు నీరు నిల్వ

బిఎన్ రోడ్డులో గుంతలతో అవస్థలు

ప్రజాశక్తి-వడ్డాది : బిఎన్ రోడ్డులో అడుగడుగునా ఏర్పడిన గుంతలతో ప్రయాణికులకు నానా అవస్థలు పడుతున్నారు. వర్షం కురిస్తే ఈ రోడ్డు అధ్వానంగా మారుతుందని, బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాబోయ్ బియన్ రోడ్డు అంటూ వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంతో వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పీడీ పాలెం, ఎల్.సింగవరం, బంగారుమెట్ట, వడ్డాది, విఆర్‌ఆర్.పేట, లక్ష్మీపురం జంక్షన్ల వద్ద గోతులు చెరువులను తలపిస్తున్నాయి. రావికమతం నుండి చోడవరం మధ్యలో ముఖ్యంగా విజయరామరాజుపేట వద్ద గోతులు మరీ దారుణంగా ఉన్నాయి. ఇక్కడ వాహనదారులు ఎటూ తప్పించుకోలేని పరిస్థితి. ఇక్కడ కచ్చితంగా గోతుల్లో దిగి వెళ్ళవలసిందే. కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా ముసురు వాతావరణం ఏర్పడడంతో గోతుల్లో నీరు చేరి నిల్వ ఉండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వాహనదారులు బిఎన్ రోడ్డులో ప్రయాణించలేక చుట్టూ తిరిగి గోరీపట్నం రోడ్డు మీదుగా చోడవరం వెళుతున్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన ప్రగడ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అమరావతి సచివాలయంలో బుధవారం కలిశారు. ఎలమంచిలి నియోజకవర్గంలో పలు సమస్యలను, ఎస్‌ఈజెడ్ పునరావాస కాలనీలో సమస్యలను సిఎం దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యలు పరిష్కారానికి సానుకూలంగా ముఖ్యమంత్రి స్పందించినట్లు నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు కుమారుడు తులసిరావును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పరిచయం చేశారు.

చంద్రబాబుకు సమస్యలను తెలియజేస్తున్న ప్రగడ నాగేశ్వరరావు

దిబ్బిడిలో ఆధార్.. రాజమండ్రిలో లింక్

విద్యుత్ శాఖ నిర్వాకంతో తల్లికి వందనం కోల్పోయిన వైనం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

తన పేరుతో రాజమండ్రిలో లింకైన వివరాలు చూపుతున్న బాధితుడు

మండలంలోని దిబ్బిడి గ్రామంలో కూలి పనులు చేసుకొని జీవిస్తున్న వ్యక్తి ఆధార్ రాజమండ్రిలోని పలు విద్యుత్ కనెక్షన్లకు లింక్ అయింది. దీంతో వారి పిల్లలకు తల్లికి వందనం పథకం అందకుండా పోయింది. మండలంలోని దిబ్బిడి గ్రామానికి చెందిన చిన్ని అప్పారావు- పార్వతి దంపతులకు చెందిన ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమార్తె మహాలక్ష్మి చోడవరంలోని ఓ ప్రయివేట్ కళాశాలలో ద్వితీయ ఇంటర్, కుమారుడు రామ్‌చరణ్ తేజ దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. ఇటీవల ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం పథకం కింద తల్లి పార్వతి బ్యాంకు ఖాతాలో నగదు జమ కాలేదు. దీంతో తండ్రి అప్పారావు దిబ్బిడి గ్రామ సచివాలయంలో సంప్రదించగా విద్యుత్ బిల్లు అదనంగా వచ్చిందని, మీ పేరుతో రాజమండ్రిలో పలు విద్యుత్ మీటర్లు ఉన్నాయని సచివాలయం సిబ్బంది తెలియజేశారు. రాజమండ్రి ప్రాంతంలో పలు మీటర్లు, విద్యుత్ కనెక్షన్‌కు అప్పారావు ఆధార్‌కు లింకు అయినట్లు తెలియజేయడంతో లబోదిబోమంటూ బుధవారం రాజమండ్రికి పయనమయ్యాడు. అక్కడ విద్యుత్ శాఖ అధికారులను కలిసి ఆధార్ లింకులను తొలగించడానికి బయలుదేరి వెళ్లాడు. విద్యుత్ శాఖ అధికారులు చేసిన తప్పులకు విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు.

ట్రిపుల్ ఐటికి పలువురు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికై మరోసారి లక్ష్మీపురం హైస్కూల్ సత్తా చాటిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.యేసుదాసు తెలిపారు. జనపరెడ్డి హేమలత (587), జొన్నాడ యశశ్రీ (581) నూజివీడు ట్రిపుల్ ఐటిలోనూ, వీరమల్ల గుణశ్రీ కీర్తి (577), పాతాలం హర్ష వర్ధన్ (577) శ్రీకాకుళం ట్రిపుల్ ఐటిలోనూ సీట్లు సాధించారు. వీరిని పూర్వ ప్రధానోపాధ్యాయులు ఎవి.జగన్నాథరావు, సిరసోళ్ల విజయకమల, సర్పంచ్ గంగా భవాని గణపతి నాయుడు, కమిటీ ఛైర్మన్ బి.నర్సింగరావు, మాజీ సర్పంచ్ సిరిసోళ్ల సత్యారావు అభినందించారు.

దేవరాపల్లి : దేవరాపల్లి మండలానికి చెందిన ఇద్దరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారు. వేచలం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన గుంపాన ఉదయ్ కుమార్ నూజివీడు ట్రిపుల్ ఐటికి, తెనుగుపూడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి పెనగంటి రోహిత్ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

అనకాపల్లి : మండలంలోని మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు పొందిన పీలా భవిత్రశ్రీ (588), దండుపాటి యశోధర (574) నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటిల్లో సీటు పొందారు. ఈ సందర్భంగా వారిని బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు హెచ్‌బి.శ్రీధర్ ఉపాధ్యాయులు పూలగుచ్ఛాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గొంది చిన్నబ్బాయ్, బాబు, సుబ్రహ్మణ్యం, సుబ్బారావు, వసంతరావు, కరణ జ్యోతి, దయాసాగర్, ఆచార్యులు, లక్ష్మి, రమణి, జగదీశ్వరి సుజాత, ఈశ్వరబాబు, నాగమణి, సుబ్బలక్ష్మి, శ్రీదేవి, ఎర్రయ్య పాల్గొన్నారు.

ఎంపికైన దేవరాపల్లి మండల విద్యార్థులు

మామిడిపాలెం హైస్కూల్‌లో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మహిళా కళాశాల వసతి గృహం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా కేంద్రంగా ఎస్‌సి మహిళా కళాశాల వసతి గృహం ఏర్పాటు చేయాలని ఎఐఎస్‌ఎఫ్ నాయకులు బుధవారం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామనాథంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌లో ఉన్న సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని కోరారు. శిథిలావస్థలో ఉన్న హాస్టల్ భవనాల స్లాబులను పడగొట్టి తాత్కాలికంగా రేకులతో ముస్తాబు చేస్తున్నారని, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అనకాపల్లి జిల్లాలో మాత్రమే ఈ రకంగా రేకుల షెడ్డు వేసి తాత్కాలిక పరిష్కారం చూపిస్తున్నారని పేర్కొన్నారు. ఇది సరికాదని, కొత్తగా స్లాబ్ వేయాలని కోరారు. జిల్లా కేంద్రంలో మహిళా వసతి గృహం లేకపోవడం వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థినులు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి జగదీష్ పాల్గొన్నారు.

ఎస్‌బిఐ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-సబ్బవరం : ఎస్‌బిఐ 70 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఛైర్మన్ శ్రీనివాస శెట్టి పిలుపు మేరకు 70 వేల యూనిట్లు రక్త సేకరణలో భాగంగా స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆవరణలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. అనకాపల్లి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మహాపాత్ర, ఎస్‌బిఐ స్టాఫ్ యూనియన్ రీజనల్ సెక్రటరీ పైల ప్రసాదరావు ఈ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో 71 యూనిట్లు రక్తం సేకరించారు. జనసేన నేతలు బలిరెడ్డి అప్పారావు, క్రి కనకరాజు, వర్రి పూర్వ చంద్రరావు రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సబ్బవరం బ్రాంచ్ మేనేజర్ డి.రాజశేఖర్, మురళి, కళ్యాణ్, రమేష్, టిడిపి నేత బోకం సత్యనారాయణ, జనసేన నేతలు పల్లి మంగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న దృశ్యం

నిషా ముక్త్ భారత్ ర్యాలీల్లో భాగస్వామ్యం కావాలి

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లా కేంద్రం, నియోజకవర్గ కేంద్రాలలో నిషా ముక్త్ భారత్ ర్యాలీలు గురువారం సాయంత్రం 4.30 గంటల నుండి 5.30 గంటల వరకు పెద్ద ఎత్తున చేపట్టాలని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో నిషా ముక్త్ భారత్ ర్యాలీ కార్యక్రమంపై జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణరావుతో కలిసి సంబంధిత అధికారులతో బుధవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్ తరాల రక్షణలో భాగస్వామ్యం కావాలని, నషా ముక్త్ భారత్ ర్యాలీకి యువత, మహిళలు, విద్యార్థులు, గ్రామ /వార్డు సచివాలయాల సిబ్బంది, ఆశా, అంగన్వాడీ వర్కర్లు ప్రజలు, పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. యువత గంజాయి, డ్రగ్స్, మద్యపానం వంటి దురాచారాల వలలో పడకుండా ఉండే విధంగా వారిలో చైతన్యం కలిగించాలన్నారు. ఇది కేవలం అవగాహన కార్యక్రమం కాక, ఒక సామాజిక ఉద్యమంగా మారాలన్నారు. అనకాపల్లిలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియం నుండి పెంటకోట భవనం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలను రౌండ్ టేబుల్ చర్చలు, ప్రచార ర్యాలీలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు, మైమ్స్ వంటివి ఉపయోగించి చైతన్యవంతంగా మలచాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల విద్యార్థులు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓలు షేక్ అయిషా, వీవీ రమణ, డిఎస్పీలు, సీఐలు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ పిల్లలు, కార్యకర్తలు, మహిళలు

అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని ర్యాలీ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మూడేళ్లు దాటిన చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్త ఆర్.జయలక్ష్మి ఆధ్వర్యాన మండలంలోని పోలేపల్లి గ్రామంలో అంగన్వాడీ పిలుస్తోంది పేరుతో ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు పోషకాహారం అందించడంతో పాటు వారికి ఆటపాటలతో విద్యాభ్యాసం నేర్పిస్తామని జయలక్ష్మి తెలిపారు. చిన్నారుల సంరక్షణకు ఆయా ఉంటుందని చెప్పారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు.

ఉప ఖజానా అధికారికి సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి సబ్ ట్రెజరీ అధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వి.వి.జోగారావును బుధవారం ఆయన కార్యాలయంలో సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్లా నాగభూషణం మాట్లాడుతూ ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పట్నాల కృష్ణమోహన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, ప్రభుత్వ పెన్షనర్స్ భీశెట్టి రామకృష్ణ, కొత్తూర్తి రామారావు, అయ్యవరపు రమణమూర్తి, బూడిద జోగారావు పాల్గొన్నారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శిగా వేగి

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ మాడుగుల నియోజకవర్గం ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శిగా వేగి రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాడుగులలో బుధవారం జరిగిన ఫెడరేషన్ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టు సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఫెడరేషన్ నాయకులు బి.ఈశ్వరరావు, బి.వెంకటేష్, ఏ.ఖాదర్, ఎస్‌కె బాషా, బి.ఈశ్వరరావు, బి.శ్రీనివాసరావు, కె.మదన్, యలమంచిలి ధర్మారావు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురంలో రహదారి విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ పనులు చేయడానికి అచ్యుతాపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం గంటల వరకు విద్యుత్తు నిలుపుదల చేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అచ్యుతాపురం, రామన్నపాలెం, మోసయ్యపేట, చౌడపల్లి, వెదురువాడ, మార్టూరు, దిబ్బపాలెం పంచాయతీలు, వాటి శివారు గ్రామాలలో విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని వల్లపు సోమవరం గ్రామంలో విజయనగరం శ్రీవెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి శిబిరం నిర్వహించారు. తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గోంతిని శ్రీనివాసరావు ఆర్థిక సహాయంతో దీనిని ఏర్పాటు చేశారు. కంటి వైద్యులు 21 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ కోసం తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోంతిని నాగరత్నం, అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఉల్లింగల రమేష్, అచ్చర్ల గ్రామ టిడిపి అధ్యక్షులు నైనమశెట్టి రమణరావు, విస్సన్నపేట మాజీ సర్పంచ్ చిదిరెడ్డి శ్రీను, కంటి రోగులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణులు

బాలల అక్రమ రవాణాను అరికట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : బాలల అక్రమ రవాణాను అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయడం జరుగుతుందని ఐసిడిఎస్ అనకాపల్లి సిడిపిఒ పి.ప్రభావతి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య దుర్వినియోగం, బాలల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం అనకాపల్లి జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు నిర్మల, వంశీ ప్రియ, సుచరిత, కృష్ణవేణి వెంకటలక్ష్మి, సునీత, మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కశింకోట : స్థానిక జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, బాలల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంపై అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఐ లక్ష్మణరావు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వాడకూడదని, ఎక్కడ వాడితే పోలీసులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఎన్‌జెవి ప్రసాద్‌రావు, నెంబర్-2 పాఠశాల హెచ్‌ఎం నేమాల రమణ, బి.ఆనంద్, కృష్ణారావు, పి కమల, బొడ్డేడ అప్పారావు, కాండ్రేగుల అప్పారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కశింకోటలో మాట్లాడుతున్న ఎస్ఐ లక్ష్మణరావు

దేవరాపల్లి : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్య రహిత సమాజం కోసం విద్యార్థులు బుధవారం ప్రతిజ్ఞ చేశారు. దేవరాపల్లి సచివాలయం-2 మహిళా పోలీస్ ఎస్.కె.మీరాబీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక అనారోగ్యాలు, కుటుంబ సంబంధాలు, విద్యపట్ల కలిగే దుష్ప్రభావాలపై వివరంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం ఉమా, అంగన్వాడీ సూపర్వైజర్ రాములమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వడ్డాది : యాంటీ డ్రగ్స్ డే వారోత్సవాల్లో భాగంగా బుచ్చయ్యపేట మండలం వడ్డాది హైస్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి మంగతాయారు డ్రగ్స్ తీసుకోవడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ నిర్మలాదేవి, హైస్కూల్ హెచ్‌ఎం, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : తిరుపతి కేంద్రంలోని భారత పర్యాటక శాఖ, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖల సంయుక్తంగా నిర్వహించబడుతున్న స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రిషియన్ కోర్సుల్లో 2025-26 సంవత్సరానికి సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి కె.మనోరమ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల వివరాలు

- బిఎస్‌సి (హెచ్ అండ్ హెచ్ఎ) మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సుకు ఇంటర్‌లో 40శాతం పైన మార్కులు సాధించిన వారు అర్హులు. ఈ కోర్సులో ఎఫ్ అండ్ బి ప్రొడక్షన్, సర్వీస్ ఫ్రంట్ ఆఫీస్, హౌస్ కీపింగ్ అంశాలు నేర్పించి 4నెలలు ప్రముఖ ఫైవ్ స్టార్ హోటళ్లలో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుంది.
- క్రాఫ్ట్ కోర్స్ ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పెటిసరి కోర్సుకు ఎస్ఎస్‌సి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కోర్సులో ఒక సంవత్సరం పాటు దేశ విదేశాల వంటకాలు నేర్పించి 6 నెలలు ప్రముఖ ఫైవ్ స్టార్ హోటళ్లలో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇస్తారు.
- సర్టిఫికేట్ కోర్స్ ఇన్ ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ కోర్సుకు ఎస్ఎస్‌సి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తులు చేసుకోవాలి. ఈ కోర్సులో ఐదు నెలల పాటు రెస్టారెంట్, బార్ సర్వీస్ నేర్పించి 1 నెల ప్రముఖ ఫైవ్ స్టార్ హోటళ్లకు ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుంది. ఈ కోర్సులకు వయో పరిమితి లేదు.

ఈ కోర్సులు పూర్తయిన తరువాత ఎపి రాష్ట్ర పర్యాటక శాఖ హోటళ్ళు, ప్రముఖ ఫైవ్ స్టార్ హోటళ్లల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని మనోరమ తెలిపారు. వీరికి బ్యాంక్ లోన్ సదుపాయం కలగజేస్తామన్నారు. బాల బాలికలకు వేరువేరుగా హాస్టల్ సదుపాయం కూడా ఉంటుందని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు సమాచారం కోసం 9701343846, 9100558006, 9700440604 మొబైల్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు. www.sihmtpt.org వెబ్సైట్ ద్వారా అప్లికేషన్ డౌన్లోడ్ చేసుకొని, పూరించిన దరఖాస్తులను జులై 4వ తేదీ లోపు స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రిషియన్ తిరుపతి చిరునామాకు పంపించాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి మనోరమ తెలిపారు.

బీమా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన మూడు కుటుంబాలకు మంజూరైన పిఎంజెజెబివై పథకం బీమా చెక్కులను కశింకోట గ్రామీణ బ్యాంకు మేనేజర్ కవిత బుధవారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన నాగరత్నం, వరలక్ష్మి, సోమేశ్వరరావుల బ్యాంకు ఖాతాల్లో రూ.2 లక్షల చొప్పున జమ చేశారు. కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.ఆంజనేయులు, ప్రాజెక్ట్ మేనేజర్ వి.అశోక్ కుమార్, కౌన్సిలర్లు ఆర్.వాణి, ఎ.గిరీష్, సిహెచ్.మహేష్ పాల్గొన్నారు.

నీటి తీరువా చెల్లించాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : రైతులు నీటి తీరువా చెల్లించాలని మండల తహశీల్దార్ ఎం.లక్ష్మి విజ్ఞప్తి చేశారు. పెదపూడి, తురకలపూడి, చిన్నప్పన్న పాలెం, ఆర్.భీమవరం, పోలేపల్లి, పెదపూడి అగ్రహారం, మంగళాపురం, గంటి కొర్లం, విజయరామరాజుపేట, వడ్డాది రైతులు నీటి తీరువా చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. డిమాండ్ నోటీసు అందించిన పది రోజుల్లోపు సచివాలయాల్లో నగదు కట్టాలని కోరారు.

వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దే రేషన్

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో 65 సంవత్సరాల పైబడిన ఒంటరి/కుటుంబ వృద్ధులు, మంచానికి పరిమితమైన వృద్ధులు, వికలాంగు రైస్ కార్డు దారులకు జూలై నెల రేషన్ ముందస్తుగా ఈ నెల 26 నుండి 30వ తేదీ వరకు వారి ఇంటి వద్దే అందజేయనున్నట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి కెవిఎల్ఎన్ మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ డీలర్లు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేస్తారన్నారు. ఇందుకు సంబంధించి రేషన్ డీలర్ల సంఘం నాయకులకు ముందుగానే సమాచారం అందించడం జరిగిందని పేర్కొన్నారు.

రేపు దుర్గమాంబ ఆలయ 6వ వార్షికోత్సవం

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం గ్రామ దేవత శ్రీదుర్గమాంబ అమ్మవారి ఆలయం పునర్నిర్మాణం చేసి ఆరు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 27న శుక్రవారం ఆలయ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు పేర్కొంది.

29న సమావేశంపై వైసిపి నేతల ప్రచారం

ప్రజాశక్తి-చోడవరం : ఈ నెల 29న ఆదివారం చోడవరంలో జరుగు వైసిపి మండల సమావేశానికి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరు కావాలని కోరుతూ ఈ పార్టీ నాయకులు చోడవరం పట్టణంలో బుధవారం ప్రచారం చేశారు. చోడవరం శివాలయం, కోటవీధి, గండి కాలనీ, 13, 14, 15, వార్డుల పరిధిలో వైసిపి నేతలు ఒరుగంటి నెహ్రూబాబు, జ్యోతుల రమేష్, బొడ్డు శ్రీరామ్మూర్తి, గునూరు రాజు, గునూరు సత్తిబాబు, పుల్లేటి వెంకటేష్, పి.శ్యామ్, చవితిని బాబూరావు, కందర్ప శంకర్, పందిరి శ్రీను, చిటికెల నగేష్, శ్రీరామ్మూర్తి, వల్లా నర్సింహమూర్తి, వజ్జల సూర్యప్రకాశ్‌రావు ప్రచారం చేశారు.

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ

ప్రజాశక్తి-వడ్డాది : తెగుళ్ల నివారణకు వరి విత్తనాలు నాటేముందు రైతులు విత్తన శుద్ధి చేసుకోవాలని వడ్డాది వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ స్థానిక రైతు సేవా కేంద్రంలో రాయితీపై వరి విత్తనాలు అందిస్తున్నామని చెప్పారు. సబ్సిడీ పోను ఆర్‌జెల్ 30 కేజీల బస్తా రూ.1000, సాంబమసూరి రూ.850, సోనామసూరి రూ.980, అమర రూ.960, మార్టేరు సాంబ రూ.750, స్వర్ణ 980కి అందిస్తున్నట్లు చెప్పారు. 1/2 కేజీ సుడో మోనస్ క్రిమిసంహారక మందు రూ.75కు అందిస్తున్నామన్నారు. బస్తాకు పావు కేజీ చొప్పున కలిపి విత్తన శుద్ధి చేస్తే తెగుళ్ళ వ్యాపించకుండా ఉంటాయని తెలిపారు.

సొసైటీ భూములకు పరిహారం చెల్లించాలి

-ఆర్‌డిఒకు మత్స్యకారుల వినతి

ఆర్‌డిఒకు వినతిపత్రాన్ని ఇస్తున్న అప్పలరాజు, మత్స్యకారులు

ప్రజాశక్తి-నక్కపల్లి: నక్కపల్లి మండలం అమలాపురం గ్రామం లో శ్రీ కనకమహాలక్ష్మి ఫిషర్మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ భూములకు పరిహారం చెల్లించాలని కోరుతూ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు ఆధ్వర్యంలో సొసైటీకి చెందిన మత్స్యకార నాయకులు బుధవారం నర్సీపట్నం ఆర్‌డి ఓ వి వి రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నేత అప్పలరాజు, మత్స్యకారులు మాట్లాడుతూ, శ్రీ కనకమహాలక్ష్మి ఫిషర్ మెన్ కో-ఆపరేటివ్ సొసైటీకు 1994 సంవత్సరంలో ఆనాటి ప్రభుత్వం వేంపాడు రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 410/4లో 16 ఎకరాల 65 సెంట్లు, 417లో 11 ఎకరాల 50 సెంట్లు, 418 లో 15 ఎకరాలు మొత్తం 43 ఎకరాల 15 సెంట్లు భూమిని లీజుకు ఇవ్వడం జరిగిందని, నాటి నుండి నేటి వరకు ఆ భూముల పై ఆధారపడి జీవనం సాగిస్తున్నామన్నారు. తమకు ఆ భూములు తప్ప వేరే ఆధారం ఏమీ లేదన్నారు. తమకు పరిహారం చెల్లించకుండా బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటుకు రహదారి నిర్మాణ పనులు చేపడుతున్నారన్నారు. ఎన్ఏఓబి నిర్మాణం సందర్భంగా మత్స్యకార సొసైటీ భూములకు ఆనాటి ప్రభుత్వం పరిహారం చెల్లించిందని తెలియజేశారు. 2016 లో ఆనాటి విశాఖపట్నం జిల్లా కలెక్టర్ మత్స్యకార సొసైటీ భూములకు పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని తమకు పరిహారం చెల్లించి, న్యాయం చేయాలని ఆర్డిఓ ను కోరారు. ఈ మేరకు ఆర్డిఓ స్పందించి ఇప్పటికే జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లడం జరిగిందని, మరోసారి విన్నవిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

కొనసాగిన ఆందోళన

నక్కపల్లి: మండలంలో వేంపాడు రెవెన్యూ అమలాపురంలో శ్రీ కనకమహాలక్ష్మి ఫిషర్మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ భూములకు వెంటనే పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, మత్స్యకారులు డిమాండ్ చేశారు. పరిహారం చెల్లించాలని కోరుతూ మత్స్యకారులు తలపెట్టిన ధర్నా బుధవారం నాటికి 7 వ రోజుకు చేరింది. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పెద్ద సంఖ్యలో మత్స్యకారులు, మత్స్యకార మహిళలు తరలి వచ్చి ధర్నాలో పాల్గొన్నారు. పరిహారం చెల్లించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. పరిహారం చెల్లించకుండా పనులు చేపట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. పరిహారం, ప్యాకేజీ చెల్లించే వరకు ధర్నా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు, మత్స్యకార మహిళలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్

30 లోపు రేషన్ అందజేయాలి

ప్రజాశక్తి- కోటవురట్ల: వృద్ధులకు, వికలాంగులకు ఈనెల 26వ తేదీ నుంచి 30 లోపు రేషన్ సరుకులు అందజేయాలని తహసిల్దార్ తిరుమలబాబు సూచించారు. బుధవారం కార్యాలయంలో డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, డీలర్లు సమయపాలన పాటించాలన్నారు. మండలంలో 38 రేషన్ దుకాణాలకు గాను ఎన్ని ఎమ్లెట్ గ్రామాలు ఉన్నాయో అడిగి వివరాలు తెలుసుకున్నారు, సుమారుగా 17 గ్రామాలు ఉన్నట్లు గుర్తించారు. ఆయా గ్రామాలకు ఏ విధంగా సరుకులు అందజేస్తున్నారని వివరాలను అడిగి తెలుసుకున్నారు ఏమ్లెట్ గ్రామాలకు కూడా సకాలంలో సరుకులు అందజేయాలన్నారు. వినియోగదారులకు ఎటువంటి అసౌకర్యం కలిగిన సహించేది లేదని చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మణికంఠ, డీలర్లు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా నూకాలమ్మ పండగ

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలో అమలాపురం పంచాయతీ పాటిమీద గ్రామంలో నూకాలమ్మ తల్లి పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. నూకాలమ్మ పండుగ సందర్భంగా ఆలయానికి రంగులు వేసి పూల అలంకరణతో అందంగా ముస్తాబు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. పండుగ సందర్భంగా గ్రామములో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు.

మార్కెట్ యార్డులో మొక్కలు నాటివేత

మొక్కను నాటుతున్న నాయకులు

ప్రజాశక్తి-రావికమతం: మండలంలో కొత్తకోట మార్కెట్ యార్డులో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా ఉప సర్పంచ్ పందల దేవ ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మాట్లాడుతూ, ఇప్పటికే మార్కెట్ యార్డ్‌లో పూర్తిస్థాయి షెడ్లు నిర్మాణం, ఫెన్సింగ్, మంచినీటి, మరుగుదొడ్ల నిర్మాణం, లైటింగ్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించిన అనంతరం రోజువారి మార్కెట్ కార్యకలాపాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా కాము, వేప, బాదం, మామిడి, పనస, తదితర 250 మొక్కలను నాటడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉప సర్పంచ్ కేదారిశెట్టి గున్నజి, సీతా సంతోషి, శ్రావణి, పూడి నాగరాజు, సిద్ధబత్తుల రాజారావు, విసారపు రమణ, ఫీల్డ్ అసిస్టెంట్ కోట బాబురావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ..

కోటవురట్ల: ఉపాధి హామీ ద్వారా చేపట్టిన ఫారం ఫండ్ పనులను చేపట్టిన రైతులకు బుధవారం కొబ్బరి, మామిడి, సపోటా, మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీవో నాగరాజు మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా 25 గ్రామాలకు గాను 356 ఫారం ఫండ్ పనులు మంజూరు కాగా 240 పనులు చేపట్టిన గ్రామాలకు 3420 మొక్కలు పంపిణీ చేశారు. రెవెన్యూ ప్లాంటేషన్ కోసం 600 మొక్కలు రామచంద్రపురం నుంచి అలుముయ పాలెం వరకు పెంపకం చేపడతామన్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కొత్తకోటలో కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-రావికమతం: మండలంలో కొత్తకోట గ్రామంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరం శ్రీ వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి (విజయనగరం) సౌజన్యంతో పతివాడ ధనంజయ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరానికి వచ్చిన రోగులకు శ్రీ వెంకటేశ్వర పుష్పగిరి ఆసుపత్రి వైద్య నిపుణులు లిఖిత, బిందులు కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 19 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించామన్నారు. వీరిని తమ ఆసుపత్రి బస్సు ద్వారా ఉచితంగా విజయనగరం తీసుకువెళ్లి ఆపరేషన్ అనంతరం తిరిగి వారి ఇంటికి చేర్పించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పతివాడ ధనంజయ్ తదితరులు పాల్గొన్నారు.

కురుస్తున్న చిరు జల్లులు

రోజంతా చిరుజల్లులు

ప్రజాశక్తి-నక్కపల్లి: బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడడంతో ముసురు వాతావరణం నెలకొంది. మండలంలో బుధవారం ఎడతెరిపి లేకుండా చిరుజల్లులు కురవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర అవస్థలు పడ్డారు. పలు గ్రామాల్లో రహదారులు చిత్తడి చిత్తడిగా దర్శనమిచ్చాయి.

పార్టీకి నష్టం కలిగిస్తే ఉపేక్షించం

-జనసేన నేత సూర్యచంద్ర

మాట్లాడుతున్న సూర్యచంద్ర

ప్రజాశక్తి-గొలుగొండ: జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ నిర్ణయాలు, ఆశయాల మేరకే ప్రతీ ఒక్క జనసైనికులు నడుచుకోవాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రాజాన వీరసూర్యచంద్ర అన్నారు. బుధవారం గొలుగొండలో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ పార్టీకి నష్టం కలిగించే చర్యలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించేది లేదన్నారు. పార్టీకి చెందిన కొంత మంది తమ సొంత నిర్ణయాలతో పార్టీకి నష్టం కలిగించే పనులు చేస్తున్నారని, ఇది మానుకోకపోతే చర్యలు తీసుకోవడం తప్పదన్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదన్నారు. పార్టీ నిర్ణయాలకు తలొగ్గి జనసైనికులు నడుచుకోవాల్సిన చేయాల్సిన అవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ మండల పార్టీ అధ్యక్షులు గండెం దొరబాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సలాదుల ప్రసాద్ బాబు, దేవి, సీనియర్ నాయకులు రేగుబల్ల శివ, గొలుగొండ మండల బిసి సెల్ అధ్యక్షులు ముక్కలి మహేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు బోయిన చిరంజీవి, అబ్బానాయుడు తదితరులు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో పెదబోదుగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి బదిలీ అయిన ముగ్గురు ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయురాలు ఎస్ జయ శ్రీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బుధవారం సాయంత్రం బదిలీ అయిన ఉపాధ్యాయులు చోడిశెట్టి సత్యనారాయణ, కె చిన్నారావు, ఏ.శ్రీదేవిలకు జ్ఞాపికలు అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు చేసిన సేవలను పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎన్‌విస్ ఆచార్యులు, ఎస్ పాల్గుణరావు, ఏ.వి.ఎల్.ఎన్. కుమారి, .పద్మావతి, రమేష్ బాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ

మాడుగులలో విత్తనాలు ఇస్తున్న సర్పంచులు

ప్రజాశక్తి- మాడుగుల: రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఒమ్మలి, ముకుందపురం గ్రామాల సర్పంచులు సుంకరి సింహాచలంనాయుడు, కర్రి గణేష్ తెలిపారు. ఒమ్మలి ముంకుందపురం గ్రామాల రైతు సేవా కేంద్రాలలో రైతులకు వరి విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులకు సకాలంలో విత్తనాలు రాయితీపై ప్రభుత్వం పింపిణీ చేస్తుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులను ఆదుకోంటుందని, రైతులకు గిట్టుబాటు ధర కల్పింస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల మాజీ సర్పంచి నందారపు సన్యాసిరావు, నేమాని మహలక్ష్మినాయుడు, కాతరాజు, నేమాని మహలక్ష్మినాయుడు, వుగ్గిన వెంకటరమణ, ముకుందపురం సర్పంచి కర్రి గణేష్ పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని ఉగ్గినిపాలెం గ్రామ సచివాలయం వద్ద వరి విత్తనాలను గ్రామ వ్యవసాయ సహాయకులు నాగేశ్వరరావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఉగ్గిని రమణమూర్తి, కలగా సోమేశ్వరరావు, కలగా గోవింద, కరణం గోవింద్, కరణం వెంకటరమణ, కలగా శ్రీను, కలగా పార్వతి, పిల్లి సతీష్, తాడి రమణ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో బుధవారం గ్రామ సర్పంచ్ ఎస్ భాగ్యలక్ష్మి బాపు నాయుడు చేతులమీదుగా వరి విత్తనాలు రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, గ్రామ ఉప సర్పంచ్ బి రాము, కర్రి ఆదిబాబు, ఆడారి అర్జున, కర్రి పెంటారావు, మల్ల చినబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ

ప్రభుత్వ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో గిరిజన గ్రామమైన చీడికలో బుధవారం ఎంపీడీవో డి సీతారామరాజు ఆధ్వర్యంలో దర్తి అబా జన్ భగీరది అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐసిడి ఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీలు స్టాల్‌ను ఏర్పాటు చేసి పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో స్టాల్ ఏర్పాటు చేసి వ్యవసాయ పథకాలను వివరించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి, రోగులకు మందులను అందజేశారు. అనంతరం పాఠశాలను సందర్శించి, మధ్యాహ్నం భోజనం తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

శ్రీ ప్రకాష్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి -పాయకరావుపేట: ఐఐఎస్ఇఆర్ (ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్)ఫలితాలలో తమ విద్యార్థి జి. సాయి అనీష్ ఆల్ ఇండియా లెవెల్ లో 434 వ ర్యాంకు సాధించాడని శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్ తెలిపారు. తమ కళాశాలలో చదువుచున్న విద్యార్థులకు ఐఐటి, జెఇఇల తో పాటుగా అన్ని పోటి పరీక్షలకు కోచింగ్ ఇవ్వడం ద్వారా ఈ ర్యాంకు సాధించాడని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

సాయిఅనీష్

పూడుస్తున్న గోతులు

గోతులు పూడ్చివేత పనులు

ప్రజాశక్తి-గొలుగొండ:నర్సీపట్నం కృష్ణదేవిపేట రహదారిలో కల్వర్టుల వద్ద ఏర్పడ్డ గోతులను ఆర్అండ్‌బి అధికారులు ఎట్టకేలకు పూడ్చి వేయిస్తున్నారు. ఈ రహదారి గుండా ఉన్న కల్వర్టుల వద్ద ఏర్పడ్డ గోతుల వద్ద ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఆరిలోవ అటవీ ప్రాంతం, పప్పుశెట్టిపాలెం జంక్షన్ సమీపంలో, గొలుగొండ కాలనీ వద్ద, లింగంపేట సమీపంలోనూ, తాళ్ల చీడికాడ జంక్షన్ వద్ద కల్వర్టులు ప్రాంతాల్లో ఉన్న గోతులను మెటల్ వేసి పూడ్చివేయించారు. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

27న మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ కోసం ప్రవేశ పరీక్ష రాసి, సీటు రాని విద్యార్థులు ఈ నెల 27న విశాఖ శ్రీకృష్ణాపురం గురుకుల పాఠశాలలో మిగులు ఖాళీలకు అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.కోటేశ్వరరావు తెలిపారు. పరీక్ష రాసి సీటు పొందలేని విద్యార్థులందరూ, తమ ర్యాంక్ కార్డు, ఆధార్ కార్డులో కృష్ణాపురం గురుకుల పాఠశాలలో జరిగే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని చెప్పారు.

విపత్తులను ఎదుర్కొనేందుకు సమగ్ర ప్రణాళిక

- జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ప్రతినిధులు

కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమైన ఎన్‌డిఎంఎ ప్రతినిధులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో సమగ్ర ప్రణాళిక రూపొందించాలని, భవిష్యత్తు అవసరాలను, ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని పాతవాటిని నవీకరించాలని జాతీయ విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ (ఎన్‌డిఎంఎ) ప్రతినిధులు నావల్ ప్రకాశ్, అభిషేక్ బిశ్వాస్, అభినవ్ వాలియా పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితుల అధ్యయనం కోసం అధికారులతో సంప్రదింపులు చేసేందుకు బుధవారం జిల్లాకు వచ్చిన వారు ముందుగా జిల్లా కలెక్టర్‌ను ఆయన ఛాంబర్‌లో కలిశారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా సమగ్ర ప్రణాళిక, విపత్తుల నిర్వహణలో అంతర్ జిల్లాల సహకారం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ భవనంలో వివిధ శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. విపత్తుల నిర్వహణలో జపాన్ అనుసరించిన సాండియా ఫ్రేమ్‌వర్క్, ప్రధానమంత్రి రూపొందించిన 10 సూత్రాల అజెండా, డిజాస్టర్ రిస్క్ మేనేజ్‌మెంట్‌లో అనుసరించాల్సిన విధానాలపై సమీక్షించారు. ఎన్‌డిఎంఎ రూపొందించిన పిపిటిని ప్రజెంట్ చేశారు. జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ రూపొందించిన నిబంధనలను సూక్ష్మంగా వివరించారు. జాతీయ విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ జాయింట్ అడ్వైజర్ నావల్‌ప్రకాశ్ పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా ప్రణాళికలను ఆధునికీకరించాలని సూచించారు. విపత్తుల నిర్వహణలో సాచేత్ యాప్, ఆర్టిఫిసియల్ ఇంటిలిజెన్స్, డ్రోన్ వ్యవస్థలను వినియోగించుకోవాలని చెప్పారు. ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌టిఆర్ఎఫ్, క్షేత్రస్థాయి అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ప్రకృతి విపత్తులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, విరివిగా మాక్ డ్రిల్స్ నిర్వహించాలని సూచించారు. వినూత్న రీతిలో మాస్ క్యాంపెయిన్ కార్యక్రమాలను చేపట్టాలని, ప్రధాన మంత్రి రూపొందించిన 10 సూత్రాలపై అవగాహన కల్పించాలన్నారు. వాటిని ప్రతి కార్యాలయం నోటీస్ బోర్డులో ఉంచాలన్నారు. ప్రతి కార్యాలయం వద్ద ప్రాథమిక ఎమెర్జెన్సీ కిట్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సాచేత్ యాప్‌ను వినియోగించటం ద్వారా ప్రమాద హెచ్చరికలను మెసేజ్‌ల రూపంలో పొందవచ్చని తెలిపారు. పరిశ్రమలు, కొత్త ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చే సమయంలో అన్ని రకాల నిబంధనలు పాటించాలని, లేకుంటే భవిష్యత్తులో విపత్తులను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆయా ప్రాంతాల్లో ఉండే ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బెటాలియన్ల సంఖ్యను పెంచుకునేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు. దేశంలోనే మొదటగా జాతీయ సైక్లోన్ మిటిగేషన్ కేంద్రాన్ని ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. విశాఖలాంటి ప్రాంతంలో అన్ని రకాల విపత్తులు సంభవించడానికి ఆస్కారం ఉన్నందున అన్ని రకాలుగా ప్రణాళిక రూపొందించుకుని సన్నద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఎన్‌డిఎంఎ ప్రతినిధి సిహెచ్ పీటర్, డిపిఎం రాము, సివిల్ డిఫెన్స్ అధికారి మధుసూదనరావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి, ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ ప్రతినిధులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ప్రాథమిక విద్యను లేకుండా చేస్తోంది

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రాథమిక విద్యను లేకుండా చేసే విధానాన్ని అమలు చేస్తోందని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చింతా మోహన్ ఆరోపించారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, విద్య చాలా ప్రధానమైనదన్నారు. రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు దేశమంతా ప్రతి గ్రామంలోనూ ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించారని తెలిపారు. ఎపిలో 35 వేల ప్రాథమిక పాఠశాలలను కాంగ్రెస్ హయాంలో ఏర్పాటుచేసి విద్యకు చాలా ప్రాధాన్యత ఇచ్చామన్నారు. మధ్యాహ్న భోజన పథకం తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. కూటమి ప్రభుత్వం విద్యకు విలువ ఇవ్వడం లేదన్నారు. పాఠశాలల సంఖ్యను తగ్గిస్తూ వస్తుందన్నారు. 35 వేల పాఠశాలలను పదివేలకు కుదించాలని ఆలోచన చేస్తోందని తెలిపారు. గత సంవత్సర కాలంలో 5 వేల పాఠశాలలను మూసివేయగా, ఈ సంవత్సరం మరో 5 వేలను తగ్గించాలని కూటమి ప్రభుత్వం అనుకుంటోందని చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. 150 మంది ఎమ్మెల్యేలు ఉంటే, స్కూళ్లను మోసేస్తారా? అని ప్రశ్నించారు. చంద్రబాబు ఏడాది పాలనలో చేసింది సున్నా అన్నారు. ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు.

ఉక్కు కర్మాగారం గురించి మాట్లాడుతూ, కేంద్రానికి మద్దతు ఇస్తూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ గురించి ధైర్యంగా చంద్రబాబు అడగలేక పోతున్నారని విమర్శించారు. నెలలోపు కేంద్ర కేబినెట్‌లో బిల్లు పెట్టి ప్రైవేటీకరణ చేయబోమని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

ఎమర్జెన్సీ కాలం కంటే, ఇప్పుడు బిజెపి పాలనలో ప్రశ్నించిన ప్రతి గొంతును అణచివేస్తున్నారని, అరెస్టులు చేసి జైల్లో పెడుతున్నారన్నారు. బిజెపి పాలనలో భారతదేశం బలహీనమైపోయిందని, పత్రికా స్వేచ్ఛ లేదని పేర్కొన్నారు.

ట్యాబ్‌లను పంపిణీ చేసిన స్పీకర్ అయ్యన్న పాత్రుడు

ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి -నర్సీపట్నం:నర్సీపట్నం పరిధిలో గల మెప్మా రిసోర్స్ పర్సన్స్‌కు స్పీకర్ అయ్యన్నపాత్రుడు బుధవారం ట్యాబులు పంపిణీ చేశారు. మహిళా వికాసం యాప్ ద్వారా బ్యాంకు రుణాలు, సంఘ సమాచారం, స్వయం ఉపాధి వ్యాపారాల కోసం అనువుగా ఉంటుందని, ఇందుకోసం గెలాక్సీ ట్యాబ్లను 60మంది రిసోర్స్ పర్సన్స్ ఎంపిక చేసి అందజేసినట్లు మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ భరత్ తెలిపారు. మెప్మా సేవలను మరింత వేగవంతం చేయాలని స్పీకర్ సతీమణి మున్సిపల్ కౌన్సిలర్ పద్మావతి కోరారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి -నక్కపల్లి:పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో డి సీతారామరాజు సూచించారు. మండలంలో గుల్లిపాడు గ్రామంలో శానిటేషన్ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటా తడి పొడి చెత్తను పారిశుధ్య కార్మికులు సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలిస్తున్నారు. ఈ మేరకు ఎంపీడీవో సీతారామరాజు పరిశీలించి తగు సూచనలు చేశారు. గ్రామంలో ఇంటింటా తడి పొడి చెత్తను వేరువేరుగా సేకరించి సంపద కేంద్రాన్ని తరలించి సంపదను సృష్టించుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, ఇళ్ల వద్ద నీటి నిల్వలు లేకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

వైసిపి గ్రామ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-గొలుగొండ:నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆదేశాల మేరకు గొలుగొండ మండలం గుండుపాల పంచాయతీలో గ్రామ కమిటీ ఇన్‌ఛార్జ్ సుర్ల రమణ, గ్రామ సర్పంచ్ జాగు రామకృష్ణ, మండల సీనియర్ నాయకులు కొరుప్రోలు పాణి శాంతరామ్, ఎంపీటీసీ సత్తిబాబు, కొమిర సర్పంచ్ అల్లు రాజుబాబు, గొలుగొండ పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కొల్లు అప్పలనాయుడు ఆధ్వర్యంలో వైసీపీ గ్రామ నూతన కమిటీ ఎన్నికను నిర్వహించారు. గ్రామ పార్టీ అధ్యక్షులుగా సుర్ల నానాజీ, యువజన విభాగం అధ్యక్షులుగా గజ్జి నూకరాజు, మహిళా విభాగం అధ్యక్షులుగా కామిరెడ్డి రమణమ్మ, రైతు విభాగం అధ్యక్షులుగా బొండా ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు
షష్టిపూర్తి శుభాకాంక్షలు
అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	9490099125	పూర్ణమార్కెట్	9490099676
మధురవాడ	8008596645	జగదాంబ	9490099434
గాజువాక	9849392359	జివియంసి	9490099483
అనకాపల్లి	8008736188	ద్వారకానగర్	9490099672
చోడవరం	9490099141	కంచరపాలెం	9490099135
నర్సీపట్నం	9440280411	మాదవధార	9490099675
పాడేరు	9490099142		
రంపచోడవరం	9440165617		